విశాలాంధ్ర

వైఎస్ఆర్ కడప జిల్లా | అన్నమయ్య జిల్లా

మంగళవారం 12, నవంబరు 2024 | 8 పేజీలు

జాతీయ స్థాయి క్రీడలకు ప్రతిభ సాధించిన బాలికల జట్టు

విశాలాంధ్ర - రైల్వేకోడూరు: మండలం కె బుడుగుంటపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని గవర్నమెంట్ హైస్కూల్ క్రీడా మైదానంలో హోరాహోరీగా జరిగిన రాష్ట్ర స్థాయి 68 వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అండర్ 19 బాలికల హ్యాండ్ బాల్ అంతర్ జిల్లాల పోటీలలో సత్తాచాటి జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనారని కడప జిల్లా అండర్ 19 ఆర్గనైజింగ్ సెక్రటరీ సి శారద తెలిపారు. 68 వ స్కూల్ గేమ్స్ అండర్ 19 బాలికల హ్యాండ్ బాల్ పోటీలలో శ్రీకాకుళం జిల్లా జట్టు మొదటి బహుమతి, కడప ఉమ్మడి జిల్లా జట్టు రెండవ బహుమతి, పశ్చిమ గోదావరి జిల్లా జట్టు మూడవ బహుమతి దక్కించుకున్నాయన్నారు. బాలికల హ్యాండ్ బాల్ పోటీలు ముగింపు రోజు సోమవారం స్థానిక సర్పంచ్ దార్ల చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గెలుపు ఓటములు సమానంగా -5లో

పేదలకు సాగుభూమి, ఇంటి స్థలాలు

సాధించే వరకు పోరాటం

ఆర్డీఓ కార్యాలయ ముట్టడిలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి. ఈశ్వరయ్య

- భూ కబ్జాదారుల కొమ్ముగాస్తున్న తాహసిల్దార్ల భరతం పట్టాలి
- అర్హుల జాబితా రూపొందించేందుకు అంగీకరించిన కడప ఆర్డీవో

-వార్త మెయిన్‌లో

ఉచిత ఇసుక విధానంలో..

ప్రయివేటు వ్యవస్థను రద్దు చేయాలి

: ఏఐటీయూసి

వార్త -8లో

జాతీయ వ్యాధినిరోధక టీకాలపై శిక్షణ

విశాలాంధ్ర-కడప : జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ కార్యాలయంలో "జాతీయ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం" పై జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. నాగరాజు అధ్యక్షతన జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మరియు పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధి కారులకు డాక్టర్ వరుణ్ ధర్మన్ ,ఎస్ ఎం ఓ డబ్ల్యూ హెచ్ ఓ కన్సల్టెంట్ వ్యాధి నిరోధిక టీకాల కార్యక్రమను బలోపేతం చేయవలెనని తెలిపారు. వ్యాధి నిరోధిక టీకాలు స్టార్ట్ చేసిన సమయం నుండి లబ్ధిదారులకు అందేవరకు సరిమైన ఉష్ణోగ్రత ఉండేటట్లు చూడాలని, వ్యాధి నిరోధిక టీకాలు కార్యక్రమం పై సూక్ష్మ కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని వ్యాధి నిరోధిక టీకాలు ఇచ్చిన సమయంలో టీకాల వలన దుష్పరిమాణాలు (ఏఈఎఫ్ ఐ కేసులు) ఏమైనా వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు రిపోర్టింగ్ విషయాలపై వివరించారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఉమా మహేశ్వర్ కుమార్ మాట్లాడుతూ పుట్టినప్పుడు నుండి ఐదు సంవత్సరాల వరకు ప్రతి బిడ్డకు అందవలసిన టీకాలు సరిమైన సమయంలో, సరిమైన మోతాదులో సరిమైన పద్ధతిలో అందించాలని ఏ ఒక్క బిడ్డకు మిస్ చేయకూడదని తెలిపారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. నాగరాజు 100% వ్యాధి నిరోధిక టీకాలు అందించాలని, టీకాలు అందిన ప్రతి లబ్ధిదారుని గురించి ఈవిన్ పోర్టల్ ఆర్‌సిహెచ్ పోర్టల్ ఎంసీపీ కార్డులో నమోదు చేయాలని, ఉచితంగా వ్యాధి నిరోధిక టీకాలు ఎక్కడ ఏ సమయంలో వేస్తున్నామనే విషయంపై మరియు ఏ జబ్బు రాకుండా ఏ టీకా వేస్తున్నారనే విషయంపై మరియు ప్రజలకు ఆశాల ద్వారా, ఆరోగ్య కార్యకర్తల -4లో

ప్రజల సమస్యలను...

బాధ్యతగా పరిష్కరించాలి

కలెక్టర్ శ్రీధర్ చామకూరి

విశాలాంధ్ర-రాయచోటి: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రజల సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో సోమవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసెల్ సిస్టం- పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేయడం జరుగుతోందన్నారు. ప్రతి సమస్యను, ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని, కాబట్టి అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరు శాతం పరిష్కరించాలన్నారు. ఇప్పటికే పెండింగ్లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఏ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలన్నారు. సమస్య ఏమిటి, దానిని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులకు అవగాహన ఉండాలని, చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం వివిధ సమస్యల తో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.

ప్రజల నుండి అందిన కొన్ని విజ్ఞప్తులు: గాలివీడు మండలానికి చెందిన రెడ్డప్ప రెడ్డి, తనకు పక్షవాతం వచ్చిందని, నడవలేని స్థితిలో ఉన్నానని, అందువల్ల 15 వేల రూపాయల పెన్షన్ ఇప్పించగలరని జిల్లా కలెక్టర్కు అర్జీ సమర్పించారు. తంబళ్లపల్లి మండలానికి చెందిన విజయ్ కుమార్ నాయక్, తన కూతురు జనన ధ్రువీకరణ పత్రం కొరకు తాసిల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నామని, పుట్టిన తేదీ మిస్ మ్యాచ్ అనే కారణంతో ఇంకా ఇవ్వలేదని, దీన్ని త్వరగా పరిష్కరించగలరని కలెక్టర్ గారికి అర్జీ సమర్పించారు. రాయచోటి మండలానికి చెందిన మక్బూల్ బాషా, తాను పుట్టుకతోనే వికలాంగుడినని, 15వేల రూపాయల పింఛను అందేలా చూడాలని కలెక్టర్కు విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఓ మధుసూదనరావు, ఎస్ డి సి రామసుబ్బయ్య వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులపై తక్షణం

స్పందించండి

కమిషనర్

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదుల పై తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని కడప నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. మనోజ్ రెడ్డి అన్నారు. సోమవారం కడప నగర పాలక సంస్థ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో వివిధ శాఖాధిపతులు, నగరపాలక సిబ్బంది పాల్గొన్నారు. సమస్యల పరిష్కారంలో శాఖాధికారులు స్వయంగా ఫీల్డ్‌లో గడుపుతూ తక్షణ చర్యలు తీసుకోవాలని, న్యాయ సమర్పక పరిష్కారాలు అందించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ రాకేష్ చంద్రం , డిప్యూటీ కమిషనర్ రాంబాబు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ చంద్రశేఖర్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ మునిరత్నం , ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ధనలక్ష్మి , రెవెన్యూ ఆఫీసర్ కన్నయ్య విజయ భాస్కర్ గౌడ్ , సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

విశాలాంధ్ర-చెన్నూరు : స్థానిక ఎల్లమ్మ దేవాలయం సమీపంలో గుర్తుతెలియని అనాధ శవానికి మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. మానవతా సేవా సంస్థ మాజీ అధ్యక్షుడు జివిన్ భాస్కర్ రెడ్డి హిందూ సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు చేయడం జరిగింది. మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో మండలంలో అనాథలకు అభాగ్యులకు, నిర్భాగ్యులకు ఏ కష్టం వచ్చినా మేము ఉన్నామని ముందుకు వచ్చి ఎలాంటి సహాయ సహకారం అయినా అందించే గొప్ప సమస్త అండగా ఉందని, మానవతా సేవా సంస్థ. చెన్నూరు మండలంలో ఇలాంటి కార్యక్రమాలు ముందుండి చేయడం చాలా దర్శనీకత్వం, సోమవారం అనాధ శవానికి అంత్యక్రియలు మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో జరగడంతో పలువురు సంస్థ చేసే గొప్ప పనుల గురించి చర్చించు కోవడం జరుగుతుంది . ఈ అనాధ శవానికి అంత్యక్రియలను మానవతా సేవా సంస్థ మాజీ అధ్యక్షులు జి ఎన్ భాస్కర్ రెడ్డి, ఆటో బాబు, కిషోర్ ,రామిరెడ్డి ముందుండి దహన సంస్కారాలను పూర్తి చేయడం జరిగింది.

ధూళితో పంటలకు నష్టం

లబోదిబోమంటున్న రైతులు

విశాలాంధ్ర- యర్రగుంట్ల : గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే (జాతీయ రహదారి) నిర్మాణం పనులతో విపరీతమైన ధూళి వస్తోందని ఈ కారణంగా పంట పొలాలకు తీవ్ర నష్టం కలిగే ప్రమాదం ఉందని సదరు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు కొనసాగుతున్న నేపథ్యంలో ధూళి తీవ్రత అధికమైందని ఫలితంగా సాగులో ఉన్న మొక్కల ఎదుగుదలపై ప్రభావం పడుతోందని ఈ కారణంగా దిగుబడి తగ్గే అవకాశం లేకపోలేదంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై మండల తాహసీల్దార్ శోభన్‌బాబుకు అర్బన్ సిఐ నరేష్‌బాబుకు రైతులు ఫిర్యాదు చేశారు. రోడ్డు నిర్మాణం పనులు చేపట్టిన కాంట్రాక్టు సంస్థ ధూళి నివారణా చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో రోడ్డు నిర్మాణం పనులను తాత్కాలికంగా నిలుపుదల చేయాలని వారు కోరుతున్నారు. ధూళి తీవ్రత ఇదే విధంగా ఉంటే సాగులో ఉన్న పంటలపై తీవ్ర ప్రభావం పడుతుందని వారు అధికారుల ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులను కలిసిన వారిలో మండల పరిధిలోని పెద్దనపాడు గ్రామానికి చెందిన కర్షకులు ఉన్నారు.

కార్యకర్తలకు అండగా టిడిపి

విశాలాంధ్ర- వేంపల్లి: టిడిపి కార్యకర్తలకు అండగా ఉంటుందని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, జిల్లా కార్యదర్శి సింగారెడ్డి గారి జయరామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో సోమవారం టిడిపి కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజ లకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు వీలుగా కార్యాలయాన్ని ప్రారంభించామన్నారు. ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రజల మన్ననలను పొందుతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు కడప జిల్లా వ్యాప్తంగా విశేష స్పందన లభిస్తోందన్నారు. దీపం పథకం కింద అమలు చేసిన ఉచిత గ్యాస్ సిలెండరు పథకం, ల్యాండ్ టైటిల్ రద్దు, అన్నాక్యాంటీన్ల ఏర్పాటు, పింఛన్ రూ4వేలకు పెంపు తదితర హామీలకు ప్రజల నుంచి మంచి ఆదరణ వస్తోందన్నారు. అర్హత కలిగిన ప్రతి కుటుం బానికి ఎన్డీయే ప్రభుత్వ పథకాలను అందజేయడమే టిడిపి లక్ష్యమ న్నారు. అలాగే మండల పరిధిలోని వివిధ సమస్యలను పరిష్కరిం చేందుకు తాము ఎల్లవేళలా సిద్దంగా ఉంటామన్నారు. ప్రజా సంక్షే మం కోసం టిడిపి చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. టిడిపి కార్య కర్తలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం

విశాలాంధ్ర - సుండుపల్లె : మండల పరిధి లోని తిమ్మసముద్రం పంచా యతీలోని జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పాఠ శాల ప్రధానోపాధ్యాయులు అరిపుల్ల ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత దేశ మొదటి విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు స్వాతంత్ర్య సమర యోధుడిగా భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ పనిచేశారు. ఆయన అసలు పేరు మొహియుద్దీన్ అహ్మద్ అబుల్ కలాం అనేది బిరుదు ఆజాద్' అనేది ఆయన కలంపేరు.1888 నవంబరు 11న మక్కాలో ఆలియా బేగమ్, ఖైరుద్దీన్ అహమ్మద్ దంపతులకు అబుల్ కలాం జన్మించాడు. ఆయన అరబిక్, ఇంగ్లిష్, ఉర్దూ, హిందీ, పర్షియన్, బెంగాలీ మొదలగు అనేక భాషలలో ప్రావీణ్యుడు. స్వాతంత్ర్యం అనంతరం ఏర్పడిన మొదటి ప్రభుత్వంలో సుదీర్ఘంగా 11 సంవత్సరాల పాటు విద్యా శాఖామంత్రిగా పనిచేసి దేశంలో విద్యా సంస్కరణలకు విశిష్ట మైన కృషి చేశారు. దేశంలో సమగ్ర విద్యా విధాన రూప కల్పనకు పునాదులు వేశారని దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1948లో ప్రాథమిక, ఉన్నత విద్యకు, 1952లో సెకండరీ విద్యకు ప్రత్యేక కమిషన్లు ఏర్పా టు చేశారు. ఆయన విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన తొలి ఐదేళ్ల కాలంలోనే ప్రతిష్ఠాత్మక సంస్థలతోపాటు ఖరగ్పూర్లో సాంకేతిక విద్యాసంస్థను ఏర్పాటు చేశారు. వీటితో పాటు సంగీత, సాహిత్య, లలితకళల సర్వతో ముఖాభివృద్ధికి అకాడమీలను ఏర్పాటు చేశారు. స్వయం ప్రతిపత్తి సంస్థలైన భారతీయ సాంస్కృతిక సంబంధాల మండలి, సంగీత నాటక అకాడమీ, సాహిత్య అకాడమీ, అరట్స్ అకాడమీలను ఆయన స్థాపించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు సబీహా ఖానం,ఖతీబుద్దీన్, సలీం, కలిమున్నిసా, వెంకట రెడ్డి,గౌసియ బేగం, పాల్గొన్నారు.

ప్రతిపక్షపార్టీ కార్యకర్తలపై అరెస్టులు అప్రజాస్వామికం: వైసీపీ

విశాలాంధ్ర-పులివెందుల: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ప్రతిపక్షపార్టీ కార్యకర్తలను టార్గెట్‌గా చేసుకుని అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నపూస రామలక్ష్మణ్‌రెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా కోశాధికారి రాఘవేంద్రరెడ్డిలు ధ్వజమెత్తారు. స్థానిక పాత ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలు చేస్తోందన్నారు. చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సూపర్ సిక్స్ హామీల అమలులో వైఫల్యం చెందారన్నారు. ప్రభుత్వ తప్పిదాలను ఎత్తి చూపుతుంటే అన్యాయంగా, అక్రమంగా అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రతిపక్షాలను, మరీ ముఖ్యంగా వైఎస్ఆర్‌సీపీ శ్రేణులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. భావ ప్రకటన స్వేచ్ఛ అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు అని, అందుకు విరుద్ధంగా రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు. వైసీపీ ప్రజల తరఫున ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం చేస్తుందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన అయిదు నెలల్లోనే మద్యం, ఇసుక అక్రమ రవాణా చేస్తూ అరాచక పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాల మీద ప్రజల గొంతుకను బలంగా వినిపిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తొండూరు మండల యువ నాయకులు లక్ష్మారెడ్డి, మధు రెడ్డి , హర్షద్ ,సాయి తదితరులు పాల్గొన్నారు.

శివాలయ నిర్మాణానికి అంకురార్పణ

- రూ.1.50కోట్లతో ఆలయ పునర్నిర్మాణం పనులు

- వై.కోడూరులో ప్రత్యేకపూజలు, అన్నదానం

విశాలాంధ్ర- యర్రగుంట్ల : మండల పరిధిలోని వైకోడూరు గ్రామంలో శివాలయ పునర్నిర్మాణ పనులకు సోమవారం అంకురార్పణ జరిగింది. వేద పండితుల ప్రత్యేక పూజలతో పనులకు శ్రీకారం చుట్టారు. ఇక్కడి శివాలయం కాలక్రమంలో దీనావస్థ కు చేరుకోవడంతో దాతల సహకారంతో రూ. 1.50 కోట్లతో పునఃనిర్మించేందుకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు నిర్ణయించి ఆ మేరకు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం జరిగింది. పనుల నాణ్యతలో ఎక్కడా రాజీపడకుండా ఆలయాన్ని నిర్మించాలని తలంచారు. పరమ శివుడి శివ లింగం తో పాటు అమ్మవారు (పార్వతీ దేవి) విఘ్నేశ్వరుడి గర్భ గుడులు నిర్మించను న్నారు. రాతిధ్వజ స్థంభాన్ని కూడా ప్రతిష్ఠించనున్నారు. ఆలయంలోని శివలిం గానికి పగుళ్లు రావడం, ఆలయం కూడా శిథిలా వస్థకు చేరుకోవడంతో శివాలయ పునర్నిర్మాణానికి శ్రీకారం జరిగిందని చెప్పవచ్చు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, స్థానిక గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆహార ప్రాముఖ్యతపై అవగాహన

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందుల పట్టణ పరిధిలోని బ్రాహ్మణపల్లె గ్రామంలో ఆహార ప్రాముఖ్యతపై సోమవారం అవగాహన కల్పించారు. ఆహార విజ్ఞాన శాస్త్రసాంకేతిక కళాశాల" వారు గ్రామ దత్తత కార్యక్రమంలో భాగంగా 'సమతుల్యమైన ఆహారం, రోజువారీ జీవితంలో దాని ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ సందర్భంగా సమతుల్యమైన ఆహారం తీసుకోవటం వలన కలిగే ప్రయోజనాలను యువతకు, గ్రామస్థులకు వివరించి, గ్రామస్థులకు కరపత్రాలను పంచారు. దత్తత కార్యక్రమ చైర్మన్ డాక్టర్ ఎమ్. కీర్తి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కీర్తి రెడ్డి, డాక్టర్ రాజేష్, డాక్టర్ సాయి శ్రీనివాస్, డాక్టర్ జాకిర్ బాషా, బ్రాహ్మణపల్లి గ్రామస్థులు, కళాశాల విద్యార్థులు, పాల్గొన్నారు.

మద్యం షాపును తొలగించాలి

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఓంటెల సిద్దయ్య కాంప్లెక్స్ సమీపంలోని మద్యం షాపును తొలగించాలని గతంలో ఎక్సైజ్ సిఐ టికె తులసి దృష్టికి తీసుకుపోయామని సోమవారం విద్యార్థులు, స్థానిక మహిళలు తదితరులు పాత్రికేయులతో పేర్కొన్నారు. నవంబర్ 1 లోపు మద్యం షాపును తొలగిస్తామని సిఐ హామీ ఇచ్చారని విద్యార్థులు తెలిపారు.ఇంతవరకు తొలగించలేదని ఉన్న తాదికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. మరోక సారి సిఐ దృష్టికి తీసుకుపోయి తరువాత తుది నిర్ణయం తీసుకుంటామని విద్యార్థులు పేర్కొన్నారు.మహిళా విద్యార్థులు కళాశాలకు వెళ్లాలంటే భయపడుతున్నారు.ఎక్కడంటే అక్కడ రహదారుల వద్ద మందుబాబులు విచ్చల విడిగా మద్యం సేవించి అసభ్యంగా మాట్లాడుతున్నారు.మహిళా విద్యార్థులకు అసౌకర్యంగా ఉందన్నారు.షాపు తొలగించకుంటే ఆందోళనలు చేపడతామని పేర్కొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరం

విశాలాంధ్ర - జమ్మలమడుగు : లింగ నిర్ధారణ పరీక్షలు స్కానింగ్ సెంటర్స్ చేయటం నేరమ అని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్.పి.శాంతికళ తెలిపారు. లింగ నిర్ధారణ నిషేధిత చట్టం తనిఖీలు భాగంగా సోమవారం సి.ఎస్.ఐ క్యాంబెల్ హాస్పిటల్ మరియు సాయి నర్సింగ్ హోమ్ లను సందర్శించి తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్. శాంతి కళ మాట్లాడుతూ స్కానింగ్ కేవలం బిడ్డ ఎదుగుదల మరియు లోపాలను చూడడానికేనని అన్నారు. మగ, ఆడ తలింగ నిర్ధారణకు కాదని తెలిపారు. లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ సెంటరకు 50,000 జరిమానా విడిస్తారని డాక్టరకు జైలు శిక్ష విడిస్తారని తెలిపారు. అలాగే డాక్టర్ సర్టిఫికెట్లను రద్దు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్తి కోసం మేనల్లుడిపై కత్తితో మామ దాడి

విశాలాంధ్ర-మదనపల్లె : ఆస్తికోసం మేనల్లుడిపై మామ కత్తితో దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన సోమవారం మదనపల్లె మండలం లో జరిగింది. రూరల్ పోలీసుల కథనం మేరకు.. సీటీయం పంచాయతీ సోమలగడ్డకు చెందిన చాంద్ బేగం, ఆమె సోదరుడు బాబా ఇమామ్ ఖాసీంల మధ్య గత కొన్నాళ్లుగా స్థల వివాదం నడుస్తోంది. చాంద్ బేగంకు భర్త లేదు. కుమారుడు షేక్ ఖలీల్ బాషా (28) ఉన్నాడు. ఇతని అడ్డు తొలగించు కుంటే ఆస్తి తనకు వస్తుందని బాబా ఇమామ్ ఖాసీమ్ పథకం వేసి అదునుకోసం వేచి చూశాడు. ఖలీల్ బాష తన స్నేహితుడితో కలిసి సెల్ గేమ్ ఆడుకుంటున్న సమయంలో బాబా ఇమామ్ ఖాసీమ్ ఇదే అదునుగా భావించి కత్తితో దాడి చేసి మెడపై పొడిచాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన ఖలీల్ బాషను కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

అబుల్ కలామ్ ఆజాద్ జీవితం అనుసరణీయం

విశాలాంధ్ర- పులివెందుల: భారతదేశంలో విద్యాభివృద్ధికి బాటలు వేసిన తొలి బాటసారి, స్వాతంత్ర్య సమరయోధులు, భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలా నా అబుల్ కలామ్ ఆజాద్ జీవితం అనుసరణీయమని వక్తలు పేర్కొన్నారు. జాతీయ విద్యాదినోత్సవం పురస్కరించుకుని సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆజాద్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిం చారు. అనంతరం అబుల్ కలామ్ ఆజాద్ సేవలకు గుర్తుగా భారతరత్న అవార్డు పొందారన్నారు. ఆయన సేవలకు చిహ్నంగా ప్రతి ఏటా నబంబరు 11వ తేదీన జాతీయ విద్యాదినోత్సవం జరుపుకుంటున్నారని వారు వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డా వి వర ప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్ హాఫిజుల్లా, మున్సిపల్ కమిషనర్ రాముడు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

జెఎన్‌టియు కళాశాలలో: స్థానిక జెఎన్‌టియు కళాశాలలో సోమవారం జాతీయ విద్యా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సంద

ర్భంగా భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్బంగా ప్రిన్సిపల్ విష్ణువర్ధన్ మాట్లాడుతూ స్వాతంత్ర్యానంతరం కేంద్ర విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఆజాద్ అనేక విశిష్ట సేవలు అందించారన్నారు. ఆయన సేవలకు గుర్తుగా 2008లో భారత ప్రభుత్వం ఆయన పుట్టినరోజును జాతీయ విద్యా దినోత్సవంగా నిర్ణయించిందన్నారు. విద్యా వ్యవస్థ పటిష్టతకు విద్యా వ్యవస్థను మెరుగు పరచేందుకు అంకిత భావంతోకృషి చేశారన్నారు. చిన్నారులలో ప్రాథమిక విద్యను ప్రోత్సహించేందుకు ప్రోత్సహించారని విష్ణువర్ధన్ తెలిపారు. కార్యక్రమంలో మెకానికల్ విభాగాధిపతి ప్రొఫెసర్ వి.వేణు గోపాల్ రెడ్డి, డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎం.సాంబయ్య, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

వేంపల్లెలో: వేంపల్లి కాంగ్రెస్ కార్యాలయం లో సోమవారం భారత తొలి కేంద్ర విద్యాశాఖ మంత్రి అబుల్ కలాం 126వ జయంతిని ఘనంగా నిర్వహిం చారు. ఈ సంద ర్భంగా ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిం చారు. అనంతరం ఏఐసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి మాట్లాడుతూ గొప్ప స్వాతంత్ర్య సమర యోధుడు.మహాత్ముని పిలుపు నందుకొని స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నార

న్నారు. ఆజాద్ జీవితం అందరికీ ఆదర్శం, అనుసరణీయం, మార్గదర్శకం, స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అమర్ నాథ్ రెడ్డి, ఉత్తన్న,బాళం సుబ్బరాయుడు, ఆరుసేర్ల సుబ్బరాయుడు, వెంకటేష్,బద్రి మదార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సిమెంటు రోడ్లు

- పనుల నాణ్యతలో రాజీలేదు
- పంచాయతీరాజ్ ఏఈ వినయ్‌కుమార్

విశాలాంధ్ర-యర్రగుంట్ల : ఉపాధి హామీ పథకం నిధులతో చేపడుతున్న సిమెంటు రహదారులు, కాలువల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడంతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు పనులు చేపట్టడం జరిగిందని పంచాయతీరాజ్ ఏఈ వినయ్‌కుమార్ స్పష్టం చేశారు. గ్రామ సభల్లో ప్రజల విజ్ఞప్తుల మేరకు అవసరాలు గుర్తించి స్థానిక ఎమ్మెల్యే చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి, నియోజకవర్గ టీడీపీ బాధ్యులు చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి సూచనల మేరకు రోడ్లు, కాలువల నిర్మాణం పనులు చేపట్టడం జరిగిందని ఆయన వివరించారు. మండలంలో గుర్తించిన 11 పనులను చేపట్టేందుకు రూ.2కోట్ల 83లక్షల 80వేలు మంజూరైందని వినయ్ కుమార్ తెలిపారు. తుమ్మలపల్లె గ్రామంలో రూ.56లక్షలతో పనులు కొనసాగుతు న్నాయని అలాగే హనుమనగుత్తి గ్రామంలో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు రూ.24.30 లక్షలు, వలసపల్లె గ్రామంలో పనులకు రూ.18.50లక్షలు, తిప్పలూరు రూ.10లక్షలు, వైకోడూరు రూ.17లక్షలు, ఇల్లూరు రూ.9లక్షలు, చిన్నదండ్లూరు రూ.1.70 కోట్లతో పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు నాణ్యత కలిగిన సిమెంటును వినియోగిస్తున్నామని ఆయా పనుల ప్రారంభం నాటి నుండి పూర్తయ్యే వరకు తనతో పాటు సచివాలయాల ఇంజనీరింగ్ సహాయకులు పర్యవేక్షిస్తామని వినయ్ తెలిపారు. ప్రమాణాల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని దీనిపై అధికారులు పలు సమావేశాల్లో సూచనలు చేయడం జరిగిందన్నారు.

రైతుబిడ్డ ప్రొఫెసర్ ఆదిత్యకు డాక్టరేట్

విశాలాంధ్ర -సుండుపల్లె : మండల పరిధిలోని మాచిరెడ్డిగారిపల్లె పంచాయతీ ఆరోగ్యపురంకు చెందిన రైతు మూడే అమ్మనాయక్ తనయుడు మూడే వినాయక్ ఉన్నత చదువులు చదివి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా తూర్పుగోదావరి జిల్లాలోని సూరంపాలెం మండలంలోని ఆదిత్య యూనివర్శిటీ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నాడు,ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ లభించింది. పండ్ల తోటల కోసం ట్రాక్టర్ మౌంటెడ్ రౌండ్ బేసిన్ మేకర్ కమ్ ఫర్టిలైజర్ అప్లికేటర్ అనే అంశంపై ఆయన ఆవిష్కరించిన థీసిస్కు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, లాం, గుంటూరు ఆంధ్రప్రదేశ్ ఇటీవల డాక్టరేట్ ప్రకటించినట్టు ఆదిత్య యూ నివర్శిటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎన్.సతీష్ రెడ్డి తెలిపారు. వినాయక్ ను ఆదిత్య చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, ఎన్.సతీశ్రెడ్డి, డాక్టర్ ఎం.శ్రీని వాసరెడ్డి, డాక్టర్ రమాశ్రీ అభినందించారు.దీంతో వారి తల్లిదండ్రు లు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు

విశాలాంధ్ర - బ్రహ్మంగారిమఠం : మండలంలోని గ్రామాల వారిగా పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై, 2025,26 సంవత్సరాలపై అభివృద్ధి ప్రణాళికలపై మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధు లు తో సమావేశాన్ని ఈనెల 13వ తేదీ గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్ణయించడం జరుగుతుందని మండల అభివృద్ధి అధికారి వెంగముని రెడ్డి పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం జరగబోయే సంవత్సరాలకు పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై గ్రామాలు అభివృద్ధి చెందే విధంగా గ్రామస్థాయి నుండి మండల స్థాయి వరకు ఆ శాఖ అధికారుల ద్వారా ప్రజాప్రతినిధులతో సమావేశాన్ని నిర్ణయించి వారి సలహాలు సూచనలు తీసుకొని రాబోయే (2025,26)సంవత్సరం ఉద్దేశించి ప్రణాళికలు సిద్ధం చేయాలని 13వ తేదీ జరిగే సమావేశానికి మండల స్థాయి అధికారులుప్రతి ఒక్కరు, సర్పంచులు ఎంపీటీసీలు తోపాటు మండల జడ్పిటిసి సభ్యులు రామ గోవిందరెడ్డి,(మండల పరిషత్, అధ్యక్షులు ఎంపీపీ) వీరనారాయణరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారని ఆయన తెలిపారు. ఈ సమావేశానికి ఆయన అధ్యక్షా నిర్ణయిస్తారు అన్నారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులతో పాటు కార్యదర్శి, ఆ పంచాయతీలసచివాలయం సిబ్బందితో రెవెన్యూ అధికారులు ప్రతి ఒక్కరు పాల్గొని సభను విజయవంతం చేయాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి ఈవోపీఆర్డి కుమారరంగయ్య ఏవో మల్లికార్జున, జూనియర్ అసిస్టెంట్, సుజనేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి బాటలు వేసిన ఆజాద్

విశాలాంధ్ర-రాయచోటి: మౌలా నా అబుల్ కలాం ఆజాద్ జీవితాన్ని దేశ యువత, విద్యార్థులు, ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని వైఎస్ఆర్ సిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఆర్. రమేష్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. భారతరత్న అబుల్‌కలాం ఆజాద్ దేశ సమగ్రత కోసం, హిందూ ముస్లింల ఐక్యత కోసం పాటు పడ్డారన్నారు. ఉర్దూను రెండవ అధికార బాషగా గతంలో జగన్ ప్రభుత్వం గుర్తింపు నిచ్చిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఈ సందర్భంగా రమేష్ కుమార్ రెడ్డి జాతీయ విద్యాదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

శివునికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని చిన్నయ్యగారి పల్లె సమీపంలోని ముక్కొండలో నెలకొన్న శ్రీ శ్రీ శ్రీ ముక్కంటి మల్లేశ్వరాలయం నందు వెలసిన ముక్కంటి మల్లేశ్వర స్వామి రెండవ కార్తీక సోమవారం నాడు పూజారులతో పూజలు అభిషేకం నిర్వహించడం జరిగింది. స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు ముక్కొండ ఎక్కి స్వామివారి దర్శించుకుని కాయ కర్పూరాలు సమర్పించి స్వామివారి తీర్థప్రసాదాలు తీసుకున్నారు.

కిక్కిరిసిన శివాలయాలు

విశాలాంధ్ర-పెద్దమండ్యెం : మండలంలో కర్తీక మాశాల సందర్భంగా గ్రామాల్లో ఉన్న శివ చేత్రాలు ప్రజలు శివ నమస్మరణలతో మారుమోగాయి. సోమా వారాలు సందర్బంగా భక్తులు నోములు నోమి భక్తి తో ఉపవాసం తో ఎంతో ఉత్సహం తో శివాలయలు దగ్గర పండగలు చేసి భజనలు ఆట పాటలతో ఎంతో సంతోషంగా పండుగ వాతావరణం తోపల్లెలు సంతోషంగా ఉపవా సాలు. తో భార్య భర్తలు ఆనందోస్తావాలతో పండుగలు జరుపు కున్నారు.

స్నానాల ఘాట్ ప్రారంభించిన ఎమ్మెల్సీ

విశాలాంధ్ర - బద్వేలు : బద్వేలు సిద్ధవటం రోడ్, సగిలేరు ఒడ్డున నూతనముగా నిర్మించిన స్నానాల ఘాట్ వంకెలి పోలిరెడ్డి బ్రదర్స్ ఆధ్వర్యంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ డిసి గోవిందరెడ్డి విచ్చేసి అనంతరం స్వామివారిని దర్శించుకుని ఘాట్ ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి చేతుల మీదగా ప్రారంభించడం జరిగింది. అనంతరం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. అక్కడికి వచ్చిన భక్తులందరికీ అన్న ప్రసాదం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కూడా చైర్మన్ సింగసాని గురు మోహన్, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ సాయి కృష్ణ, మున్సిపల్ పట్టణ అధ్యక్షులు సుందర్ రామిరెడ్డి, ఎంపీపీ రామసుబ్బారెడ్డి, జడ్పిటిసి పోలిరెడ్డి, బాల మునిరెడ్డి, మల్లేశ్వర్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, రమేష్ బాబు, వీరారెడ్డి, శ్రీనివాసు, రఘురాం రెడ్డి, నారాయణరెడ్డి (బాబు) జిల్లా విద్యార్థి విభాగం ఉపాధ్యక్షులు సాయి నారాయణ రెడ్డి, వైసీపీ నాయకులు, పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేసిన అధికారులు

విశాలాంధ్ర- సిద్ధవటం : మండలంలోని మాచుపల్లి రైతు సేవ కేంద్రాన్ని సోమవారం బద్వేల్ వ్యవసాయ సంచాలకులు నాగరాజు ఆకస్మిక తనిఖీ చేసి పలు రికార్డులు పరిశీలించి సిబ్బందికి తగు సలహాలు సూచనలు సమీక్షించడం జరిగింది. అనంతరం రైతు రమణారెడ్డి ఉల్లి పంటలో బంగారు తీగ(కస్కుట) అనే కలుపు మొక్కను గమనించడం జరిగింది, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు నారపు రెడ్డి మల్లికార్జున రెడ్డి మిరప పంట పొలంలో రెండవ విడతగా ద్రవ జీవామృతం పారించడం జరిగిందని రైతు సంతృప్తి వ్యక్తం చేశారని బత్తల పాలకొండమ్మ ఎన్ పి ఎం షాపు సందర్శించి జీవామృతం తయారు చేసి ట్రై కోడెర్మ, సుడోమోనాస్ గురించి అవగాహన కల్పించడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకురాలు లక్ష్మీదేవి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది చంద్రకళ చిన్నక్క రైతులు పాల్గొన్నారు.

దొంగను పట్టుకున్న రైతులు

విశాలాంధ్ర - బద్వేలు : గోపవరం మండలం పెద్దగోపవరం గ్రామ శివారు పంట పొలాల్లో పట్ట పగలే మోటర్ దొంగతనం చేస్తూ దొరికిన దొంగ,మరో ఇద్దరు పరారీ.పెద్ద గోపవరం గ్రామానికి చెందిన గోపవరం నెమిలయ్య అనే రైతు పొలం వద్దకు వెళ్లగా అక్కడ అనుమానాస్పదంగా ముగ్గురు కొత్త వ్యక్తులు కనిపించారు. కొంచెం దూరం నుంచి ఎవరు మీరు అంటూ వరిపైరుకు అమర్చిన మోటారు వైపు చూడగా అక్కడ మోటర్ కనిపించక పోవడంతో మరింత అనుమానం వచ్చి వారి వైపు పరిగెత్తుతూ కేకలు వేయగా పక్క పొలం వాళ్ళు పరుగున రావడంతో మోటార్ అక్కడ వదిలేసి ఇద్దరు పరారై ఒకరు దొరికారు.ఆ దొరికిన దొంగను రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చి వారికి అప్పగించారు. ఇంతే కాకుండా గతంలో పంట పొలాల్లోని ఎన్నో మోటార్లు,వైర్లు,పైపులు, సంబంధిత ట్రాన్స్ ఫార్మర్లలోని ఆయిల్స్ దొంగతనాలు తరుచుగా జరిగాయని వీరిని కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.మిగతా ఇద్దరి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్తా

విశాలాంధ్ర -బి.కొత్తకోట: రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్తానని బి కొత్తకోట మండలం గొళ్ళపల్లి పంచాయతీ టిడిపి నాయకుడు జగన్మోహన్ రెడ్డి అన్నారు. తంబళ్లపల్లి టిడిపి ఇన్చార్జి దాసరిపల్లి జయ చంద్రారెడ్డి ఆదేశాల మేరకు సోమవారం పార్టీ శాశ్వత సభ్యత్వం నమోదు చేసుకున్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదు చేసుకున్న ప్రతి కార్యకర్తకు నాయకునికి పార్టీ అండగా ఉంటుందన్నారు సభ్యత్వం చేసుకున్న కార్యకర్తలకు బీమా లైఫ్ ఇన్సూరెన్స్ ఆరోగ్యం వంటి సౌకర్యాలు రాష్ట్ర పార్టీ కల్పించడం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కార్యకర్తలకు నాయకులకు హామీ ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు అందుకే మన ఇన్చార్జి జయ చంద్రారెడ్డి ఆదేశాల మేరకు శాశ్వత సభ్యత్వ నమోదు చేసుకున్నానని ఆయన తెలిపారు అలాగే మండలంలో మరికొన్ని సభ్యత్వ నమోదు చేయిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో దాదం లోకనాథ్ రెడ్డి బాయగడ్డ శివరామిరెడ్డి భాస్కర్ రామచంద్ర ఆది పాల్గొన్నారు.

అబుల్‌కలాం జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

విశాలాంధ్ర-రాయచోటి: ప్రస్తుత సమాజంలోని యువత విద్యార్థులు ప్రతి ఒక్కరు శ్రీ మౌలానా అబుల్ కలాం ఆజాద్‌ను ఆదర్శంగా తీసుకోవాలని శ్రీ సాయి విద్యాసంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. రాయచోటి పట్టణం శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం భారతదేశపు మొట్ట మొదటి విద్యాశాఖ మంత్రి, భారతరత్న అవార్డు గ్రహీత స్వర్గీయ మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ 136వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి, అధ్యాపకులు ఆజాద్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.బాలాజీ, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించిన ఎమ్మెల్సీ

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్ : నాయకుడంటే ప్రజల కష్టాల్లో పాలు పంచుకోవాలి.. సమస్య ఉందంటే పరిష్కరించాలి.. అంటూ నాయకుడినే ప్రజలు ఆదరిస్తారు. అభిమానిస్తారు.. తమ గుండెల్లో పెట్టుకుంటారు. అయితే నేటి రోజుల్లో ఇలాంటి నాయకులు చాలా అరుదుగా కనిపిస్తారు. అలాంటి వారిలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ఒకరు. బద్వేలు నియోజకవర్గం పరిధిలో ఎక్కడ ఏ సమస్య ఉన్నా సరే.. తక్షణం ఆ సమస్యని పరిష్కరించేలా ఆయన చర్యలు తీసుకుంటారు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి. గత పది రోజుల్లో క్రితం పోరుమామిళ్ల మేజర్ పంచాయతీలోని దమ్మున్నపల్లె ఎస్సీ కాలనీ నీటి సమస్య ఉందని గ్రామస్తులు తెలియజేయగా ఈ సమస్య పరిష్కరించాలంటూ స్థానికులు ఎమ్మెల్సీని కోరారు. దీంతో వైస్ ఎంపీపీ సి.భాషాతో మాట్లా డారు. స్థానికులు పడుతున్న ఇబ్బందులను వివరించారు. నీళ్లకు అయితే స్థానికులు పడుతున్న కష్టాలను.. సమస్య తీవ్రతను చెప్పారు.మండల నిధుల ద్వారా నేటి సమస్యను పరిష్కరించాలని సి. భాషాని ఆదేశించడం జరిగింది. ఆయన దగ్గరుండి ప్రతి ఇంటికి నీళ్లు సరఫరా అందేలా మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు నేటి సమస్యలు పూర్తి చేశారు. సోమవారం ఎమ్మెల్సీ డిసి గోవిందరెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేసి ప్రతి ఇంటికి నీళ్లను విడుదల చేశారు. దీంతో కాలనీవాసులు ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ కాలనీవాసులు రెండు కరెంటు స్తంభాలు కావాలని విన్నవించుకోవడం జరిగింది. అలాగే వారికి వారం రోజుల్లో పరిష్కరిస్తామని తెలియజేశారు. ప్రభుత్వం ఉన్నా లేకున్నా ప్రజలకు సేవ చేయడమే తమ లక్ష్యం అన్నారు.పేద బడుగు బలహీన వర్గాల సమస్యలను జగనన్న ప్రభుత్వం హయాంలో వాలంటరీ వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటికి వెళ్లి సమస్యను పరిష్కరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీలు సి.భాష, రాజశేఖర్, రంగసంద్రం సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్ రెడ్డి, ఎంపీటీసీలు గురప్ప, ఇషాక్, వెంకటేశ్వర్లు, మాపీర, ఉప సర్పంచ్ రుద్రవరం ప్రసాద్,పార్టీ సీనియల్ నాయకులు శివయ్య, సీతారాం రెడ్డి, బాలుడు, మాల కొండయ్య, గంగయ్య, ప్రసాద్, సుబ్బా రావు, పట్టాభి, తులసి సురేష్ ,యువ నాయకుడు చిత్తా గిరి ప్రణీత్ రెడ్డి, జిల్లా విద్యార్థి విభాగం ఉపాధ్యక్షులు సాయి నారాయణ రెడ్డి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన దళితులకు ఇళ్ల పట్టాలివ్వాలి

విశాలాంధ్ర- రాయచోటి: అన్నమయ్య జిల్లాలో అర్హులైన దళితులందరికీ ఇళ్ల పట్టాలు మంజూ రు చేయాలని రాయచోటి పట్టణంలోని అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ ఎదుట సిపిఐ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య జిల్లా ప్రధా న కార్యదర్శి మర్రి సుమిత్ర లు ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చి 77 సంవత్సరాలు అవుతున్న దళితుల బ్రతుకులు మాత్రం మారడం లేదు ఇందుకు నిదర్శనం రాయచోటి నియోజకవర్గంలోని ఏ దళితవాడ చూసిన కనీస మౌలిక వసతులకు నోచుకోకుండా చాలా దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికీ చాలా దళితవాడలలో ఎవరైనా చనిపోతే స్మశాన స్థలాలు కూడా లేవని పుర్చుకోవడానికి స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం సంక్షేమ పథకాలు ఫలాలు అందరికీ అందుతున్నాయని హంగు ఆర్భాటంగా ప్రకటిస్తున్నారు, నివాస స్థలాలు సాగు భూములు కావాలని ఎన్నిసార్లు పాలకులకు ప్రభుత్వాలకు మొర పెట్టుకున్న పట్టించుకునే నాధుడే లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అర్హులైన పేదలందరికీ నివాస స్థలాలు సాగు భూములు ఇవ్వాలని ప్రధానంగా రామాపురం మండలం సుద్దమల్ల గ్రామ పరిధిలోని దళితులకు 1994 నాటి ముఖ్యమంత్రి తారక రామారావు ఇచ్చిన పట్టాలకు నివాస స్థలాలు చూపించాలని లేనిపక్షంలో అన్ని రకాలుగా అర్హులైన ప్రజలను సమీకరించి తమే నివాస స్థలాలను చూపిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాయచోటి పట్టణ కార్యదర్శి జగన్‌బాబు, కె.ఓబులేసు, ఆంజనేయులు, చిన్నప్ప, మహిళా కార్యకర్తలు సుబ్బమ్మ, ప్రమీల, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పుల్లూరు గ్రామంలో మెడికల్ క్యాంపునకు విశేష స్పందన

విశాలాంధ్ర - ఖాజీపేట : ఖాజీపేట మండల పరిధిలో గల కొత్త పుల్లూరు గ్రామంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపుకు విశేష స్పందన లభించిందని శ్రీ వెంకటలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కూన ఈశ్వర్ రెడ్డి తెలిపారు.శ్రీ వెంకటలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం కొత్త పుల్లూరు గ్రామం నందు మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంపు లో ఖాజీపేట మండల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని తమ ఆరోగ్యాలను, కంటి చూపులను పరీక్షించుకొని ఉచితంగా మందులను పొంది సంతోషం వ్యక్తం చేశారని ట్రస్ట్ చైర్మన్ కూన ఈశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మెగా మెడికల్ క్యాంప్ నందు కడప నగరానికి చెందిన అక్షయా హాస్పిటల్, పుష్పగిరి కంటి ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో డాక్టర్.వినయ్ ,డాక్టర్. వైఎస్ఎస్‌వి రెడ్డి పాల్గొని ప్రజల ఆరోగ్యాన్ని పరీక్షిం చా రు. ప్రజల ఆయురా రోగ్యాలపై శ్రద్ధ చూపుతూ ఇటువంటి మెడికల్ క్యాంపు లు ఎన్నో నిర్వహి స్తున్న శ్రీ వెంకటలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కూన ఈశ్వర్ రెడ్డికి,అలాగే ట్రస్టు సభ్యుల కు మెడికల్ క్యాంపులో ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారన్నారు. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథులుగా గంగిరెడ్డి అంకి రెడ్డి (మాజీ సర్పంచ్), కొట్లూరు భారవి (న్యాయవాది), పుష్పగిరి ధర్మ పరిరక్షణ సేవాసమితి అధ్యక్షులు ఆవుల బసిరెడ్డి,శ్రీ వెంకటలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కూన ఈశ్వర్ రెడ్డి, మెంబర్లు రామ సుబ్బారెడ్డి,సుబ్బారెడ్డి, ఓబులేసు, సుమలత, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఎపిజిబి సేవలను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-పులివెందుల: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఫీల్డ్ ఆఫీసర్ కిశోర్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. లింగాల మండలం ఇప్పట్ల గ్రామంలో సోమవారం ఆర్థిక, సాంకేతిక అక్షరాస్యత సదస్సు సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టర్మ్ డిపాజిట్లపై తమ బ్యాంక్ అధిక వడ్డీ అందిస్తుం దన్నారు. రూపే కార్డు సౌకర్యం కూడా ఉందన్నారు. రూపే కార్డు ద్వారా లక్ష రూపాయల నుంచి రెండు లక్షల రూపా యల వరకు ప్రమాదబీమా సదుపాయం ఉందన్నారు. ప్రమాద మంత్రి జీవనజ్యోతి బీమాయోజనా, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన అటల్ పెన్షన్‌యోజానా వంటి పథకాలు ఉన్నాయన్నారు. ఇలా ఎన్నో ఆకర్షణీయమైన పథకాలు ఉన్నాయన్నారు. ఖాతాదారుల శ్రేయస్సే తమ బ్యాంక్ ప్రధాన ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో కళాకారులు, ప్రజలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి

విశాలాంధ్ర - బ్రహ్మంగారిమఠం : మండలంలోని పరిధిలో ఉన్న గ్రామాల వారీగా గ్రామాలలో తాగునీటి సమస్యలను పరిష్కరించే విధంగా ప్రత్యేక దృష్టి పెట్టడం జరుగుతుందని మండల అభివృద్ధి అధికారి వెంగమునిరెడ్డి, ఒక ప్రకటన తెలిపారు. గ్రామాలలో చేతిపంపు బోర్లు రిపేరింగ్, మోటర్లు రిపేరింగ్ ద్వారా ప్రజలకు మంచినీరు అందించేందుకు ప్రత్యేకంగా దృష్టి పెట్టడం జరుగుతుందని అన్నారు. గ్రామ ప్రజలు ఇబ్బంది పడకుండా చూద్దామని బి మఠం, సహాయ అసిస్టెంట్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ ఆర్డబ్ల్యూఎస్, అధికారి, పంచా యతీ కార్యదర్శులు, మండల విస్తరణ అధికారి ఈవోపీఆర్డీ, ఉప కార్యహణాకారి ఆర్డబ్ల్యూఎస్ సబ్ డివిజన్, కార్యాలయం మైదుకూరు, బి మఠం మండల ప్రజా పరిషత్ సమాచారం కూడా తెలియజేయవచ్చు అన్నారు. ప్రజలు సంప్రదించాల్సిన మొబైల్ నెంబర్, 9100122336) సంప్రదించవచ్చని తెలిపారు.

..టీకాలపై శిక్షణ

(మొదటి పేజీ తరువాయి) ద్వారా, ఎంఎల్‌హెచ్పి ల ద్వారా విహెచ్ ఎన్డీ మరియు వి హెచ్ ఎన్ ఎస్ సి ల లో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ప్రోగ్రాం లో అవగాహన పెంపొందించాలని అప్పుడే ప్రాణాంతక వ్యాధుల నుండి రక్షణ కల్పిస్తామని ఆరోగ్యవంతమైన పిల్లలు సమాజమునకు ఇవ్వగలమని దీనికి మీరందరూ ప్రయత్నం చేయవలెనని తెలిపారు. రేపటి రోజు కూడా ఇదే కార్యక్రమం పై ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ,పట్టణ ఆరోగ్య కేంద్రం సూపర్వైజర్లకు శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీ సర్స్ మరియు ప్రాథమిక పట్టణ వైద్యఅధికారులు పాల్గొన్నారు.

అయ్యప్ప నామస్మరణతో మారుమోగిన నామాల గుట్ట

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లె : కార్తీక మాసం మొదలవడంతో అయ్యప్ప మాల దరణ స్వీకరిం చిన అయ్యప్ప భక్తులు సోమవారం మండలంలోని నామాల గుట్టపై నిర్వహిం చిన పడిపూజ కార్యక్రమంలో అయ్యప్ప నామస్మరణతో మారు మోగిం చారు. గురుస్వాములు వెంకటేశు ,గంగరాజు , సుధీర్ కుమార్ , గంగాధర్ రాజు ల ఆధ్వర్యంలో నిర్వహించిన పడిపూజ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి , అనంతపురం సర్పంచ్ లు వెంకటనారాయణ రెడ్డి, జనార్ధన్ రెడ్డి లు పాల్గొని అయ్యప్ప మాలధారి భక్తులతో కలిసి అయ్యప్ప భజనలతో పరవశింప చేశారు. కన్నె స్వాములకు మాలాధారణ వేసి స్వామియే శరణమయ్యప్ప అంటూ స్వామి శరణాలను పలకరించారు. అనంతరం దాతల సహకారంతో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు పాల్గొని అన్నప్రసాదానాలను స్వీకరించారు. ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి నీ ఆలయ కమిటీ నిర్వాహకులు గురుస్వాములు దుశ్శాలు వాళ్ళతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ నిర్వాహకులు గంగరాజు, శివ శంకర్ రెడ్డి, అయ్యప్ప స్వామి గురు స్వాము లు బుజ్జి, ఎంపీటీసీ లక్ష్మీనారాయణ, విశ్వనాథరెడ్డి, చాన్ బాషా, జాకీర్, పెద్ద సంఖ్యలో అయ్యప్ప భక్తులు, పాల్గొన్నారు.

ముందస్తు పరీక్ష క్యాన్సర్ నుండి రక్ష

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : కలెక్టర్ కార్యాలయం లోని పిజిఆర్ఎస్ హాల్ నందు "ముందస్తు పరీక్ష- క్యాన్సర్ నుండి రక్ష కార్యక్రమంలో" భాగంగా ఎన్‌సిడి 3.0 సర్వే 14-11-2024 వ తేదీ నుండి జిల్లా వ్యాప్తంగా ప్రతి గృహమునందు నివసిస్తున్న 18 సంవత్సరములు పైబడిన స్త్రీ, పురుషులకు షుగరు, బి.పి, రక్త పరీక్ష నోరు, రొమ్ము, గర్భాశయముఖ ద్వారా క్యాన్సర్ పరీక్షలు ఉచితముగా నిర్వహిస్తున్నామని ప్రజ లందరూ ఈ కార్యక్రమములో పాలు పంచుకోవాలని తెలియ జేశారు. అదేవిధంగా ఈనెల 14-11-2024వ తేదీ నుండి "రాష్ట్రీయ బాల స్వా సీయ్య కార్యక్రమంలో" భాగంగా ప్రతి అంగన్వాడి సెంటర్ నందు ప్రతి ప్రభుత్వ పాఠశాలల నందు పిల్లలకు, విద్యార్థినీ, విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తా రని జిల్లా కలెక్టర్ తెలియజేశారు. క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల సర్వే కార్యక్రమమునకు సంబంధించిన గోడపత్రాలు (పోస్టర్స్) బ్యానర్స్ స్కూల్ హెల్త్ స్క్రీనింగ్ పరీక్షలకు సంబంధించిన హెల్త్ కార్డ్స్, పోస్టర్స్ ను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమములో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, ఇంచార్జి డిఆర్వో శ్రీనివాసులు, డిఎంహెచ్వో డాక్టర్ నాగరాజు, ఎన్ సిడి నోడల్ ఆఫీసర్ డా. రమేష్, జడ్పీ సీఈవో ఓబులమ్మ, డీఈవో, ఐ సిడిఎస్ పిడి శ్రీలక్ష్మి, డిఆర్డిఏ పిడి ఆనంద్ నాయక్, డిసిహెచ్ఎస్ హిమదేవి, డిఎంవో తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అసెంబ్లీకి పోని ఎమ్మెల్యేలకు జీతాలు ఎందుకు : సీపీఐ

విశాలాంధ్ర - జమ్మలమడుగు : ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించకుండా కేవలం రాజకీయ లబ్ది కోసమే పోవాలను కునే ఎమ్మెల్యేలకు జీతాలు ఎందుకు ఇవ్వాలని సిపిఐ జమ్మల మడు గు కార్యదర్శి ప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక ఎన్జీవో నందు విలేకరులతో మాట్లాడుతూ ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం ఇసుక స్థానికంగా ఉపయోగించుకోవాలని ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు అనేక సందర్భంలో విలేకరుల సమావేశంలో చెప్పడం జరిగింది అయితే ఇసుక మాఫియా ఇసుకను జిల్లా సరిహద్దులు దాటించి లక్ష రూపాయలు సొమ్ము చేసుకుంటు న్నారని అన్నారు. ఎన్నికలకు ముందు ఎన్ డి ఏ కూటమి ఇచ్చిన హామీలపై అసెంబ్లీలో మాట్లాడకుండా ప్రతిపక్ష నేతలు అసెంబ్లీకి పోకపోవడమనేది చాలా బాధాకరమైన విషయం. అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొని ప్రజా సమస్యలపై వారు మాట్లాడాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్ నియంత్రికల తయారీ కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్ : కడప జిల్లా పోరు మామిళ్ల పట్టణంలో ట్రాన్స్‌ఫార్మర్‌ల నియం త్రికల తయారీ కేంద్రాన్ని మాజీ ఎమ్మెల్యే విజయ మ్మ, కూటమి అభ్యర్థి బొజ్జా రోశన్న, విద్యుత్ శాఖ కడప ఎస్ఇ రమణలు ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయమ్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బద్వేలు నియోజక వర్గంలో పోరుమామిళ్ల, కాశినాయన, బి.కోడూరు, కలసపాడు తదితర మండలాల రైతాంగం శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఇక్కడ కాలిపోయిన ట్రాన్స్ ఫార్మర్లను సకాలంలో మరమ్మతులు చేయించేందుకు పోరుమామిళ్లలో ఈ కేంద్రాన్ని ప్రారం భించడం జరిగిందన్నారు. అన్ని ట్రాన్స్ ఫార్మర్లు 16,25,63,100 కెవి ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులు చేస్తారన్నారు. ఈ కేంద్ర నిర్వహణ తెలుగు దేశం పార్టీ నాయకులు రామచంద్రా రెడ్డికి టెండర్ల ద్వారా దక్కించుకున్నారు. అందరికి అందుబాటులో ఉండి రైతులకు సకాలంలో మరమ్మతులు చేయించి ఇప్పిస్తార న్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు భైరవ ప్రసాద్, కృష్ణారెడ్డి, రంగసముద్రం ఎంపీటీసీ కలవకూరి రమణ, పోరు మామిళ్ల మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్, చెరుకూరి చెన్నరాయుడు నడిపి వెంకటసుబ్బయ్య, బి.కోడూరు మండల నాయకులు రామమోహన్ రెడ్డి, దుగ్గిరెడ్డి, సర్పంచ్ పవన్, విజయ కుమార్ రెడ్డి, పాపయ్య, ఇమాం హుస్సేన్, లెత్ షరీఫ్, పోరుమామిళ్ల విద్యుత్ ఏడి.రవిచంద్ర, ఏఇ.మహేష్, తెలుగుదేశం పార్టీ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మౌలానా ఆజాద్ ఆదర్శనీయుడు

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : కడప డీసీసీ కార్యాలయంలో సోమవారం ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, భారత తొలి విద్యా మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ 137వ. జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను కడప డీసీసీ అధ్యక్షురాలు ఎన్.డి. విజయ జ్యోతి ఆధ్వర్యంలో నిర్వ హించారు. డీసీసీ కార్యాలయంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవిత విశే షాలను, విద్యావ్యవస్థ కు ఆయన చేసిన కృషిని గుర్తు చేస్తూ, విద్యా, సామాజిక రంగాల్లో ఆయన చూపించిన మార్గాన్ని యువతకు స్ఫూర్తిగా చెప్పాలనే సంకల్పంతో ప్రత్యేక కార్యక్రమా లు నిర్వహిం చారు. ఈ కార్యక్ర మంలో సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు అబ్దుల్ ఖాన్, పులివెందుల నియో జకవర్గం సమన్వయకర్త ధ్రువ కుమార్ రెడ్డి, బండి జకరయ్య, అబ్దుల్ సత్తార్, బ్రహ్మానంద రెడ్డి, సంజయ్ కాంత, పాల్గొన్నారు.

వినియోగదారులపై విద్యుత్ ఛార్జీల పెంపు అన్యాయం

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : సర్దుబాటు ఛార్జీల పేరుతో పెరిగిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కడపలోని పార్టీ కార్యాలయం నుంచి మహవీర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ భవన్ వద్ద ఎన్.డి. విజయ జ్యోతి ఆధ్వర్యంలో నిరసన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో నగర అధ్యక్షుడు అఫ్జల్‌ఖాన్, పీసీసీ ప్రధాన కార్యదర్శి అలీఖాన్, పీసీసీ మాజీ ఉపాధ్యక్షులు బండి జకరయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకు లు సలావుద్దీన్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండి సుమంత్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రజలను దోచుకుంది కాబట్టే ప్రజలు మీకు ఓట్లే వేసి గెలిపించారు. అలాంటిది ఇప్పుడు మీరు కూడా ప్రజల మీద విద్యుత్ ఛార్జీల భారం మోపడం అన్యాయం. వైసీపీ తప్పు చేస్తే చర్యలు తీసుకోండి. విచారణ జరపండి. అంతేకానీ ప్రజల మీద భారం మోపకండి. విద్యుత్ ఛార్జీలు తగ్గించే వరకు కాంగ్రెస్ పార్టీ తరపున రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాజీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సత్తార్, హరిప్రసాద్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సుశీల్‌కుమార్, సిరాజుద్దీన్, బాబ్జీ, శ్యామల, సంజయ్‌కాంత, కార్యకర్తలు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాల అమలు ఎప్పుడు...?

విశాలాంధ్ర-రాయచోటి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికా రంలోకి వచ్చి రాష్ట్ర ముఖ్య మంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి నేటికీ ఐదు నెలలు పూర్తి కావస్తున్న ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల అమలు ఎప్పుడు చేస్తారని అన్నమయ్య జిల్లా డిసిసి అధ్యక్షుడు గాజుల భాస్కర ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. రాష్ట్రంలో విద్యుత్ సర్దుబాటు పేరుతో పెంచాలనుకున్న విద్యుత్ అదనపు ఛార్జీల ఆలోచనలను వెంటనే విరమించాలని డిమాండ్ చేశారు. అలాగే రాయచోటి పట్టణంలోని ఏపీఎస్పీడీసీ ఎల్ వద్ద డిసిసి అధ్యక్షుడు గాజుల భాస్కర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నల్ల బ్యాడ్జీలు ధరించి సోమవారం నిరసన తెలిపారు. విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా 7 నియోజక వర్గాల్లో పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్లు డిసిసి అధ్యక్షుడి నేతృత్వంలో నిరసనకార్యక్రమాలు చేపట్టారు. విద్యుత్ ఛార్జీలసర్దుబాటు ఛార్జీలు పెంచాలన్న ప్రతిపాదనను ఉపసంహరించుకోవా లని నినాదాలు చేశా రు. ఈ సందర్భంగా డిసిసి చీఫ్ సెక్రటరీ అమీర్ మాట్లాడుతూ వైకాప ప్రభుత్వం నాలుగేళ్లలో 7సార్లు విద్యుత్ చార్జీలు పెం చి, వినియోగదారుల నడ్డి విరగొట్టారని అన్నారు. ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం వైసీపీ బాటలో ప్రయాణిస్తుందని ఆయన మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు సర్దుబాటు పేరుతో వినియోగదారుల వీపు మోత మ్రోగించాలనుకోవడం దుర్మార్గం అన్నారు. తమ ఆలోచనలను వెంటనే ఉపసంహరించు కోవాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ ఇంజనీరింగ్ ఏపీఎస్పీడీసీఎల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయ్‌కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చాన్‌భాషా, అమీర్‌భాష, ఖాదర్‌ఖాన్, నాగలత, నవీన్, నజీర్, జాఫర్ సాదిక్, అర్షద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

రస్తాను పరిరక్షించండి

విశాలాంధ్ర -అట్లూరు : మండల పరిధిలోని అట్లూరు రెవెన్యూ గ్రామపంచాయతీ అట్లూరు క్రాస్ రోడ్ బద్వేల్ కడప ప్రధాన రహదారి మెయిన్ రోడ్డు 743 సర్వేనంబర్ నుండి 745 సర్వే నెంబర్ల పరిధిలోగల రాస్తాను పరిరక్షించి రాకపోకలను పునరుద్ద రించాలని సోమ వారం రెవెన్యూ కార్యాల యంలో జరిగిన స్పందన కార్యక్రమంలో అట్లూరు ఇంచార్జ్ తాసిల్దార్ శిరీష కు ఆ రస్తాకు సంబంధించిన భూముల రైతులు వినతి పత్రం సమర్పిం చారు. ఈ రాస్తా ను గత కొంతకాలంగా కొంత భాగాన్ని ఆక్రమించారని ఈ ఆక్రమణ తొలగించి యథావిధిగా రాకపోకలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆ వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు నాని, దొర బాబు, వెంకట సుబ్బమ్మ, సుబ్బన్న, రెవిన్యూ ఇన్స్పెక్టర్ రమణ, జూనియర్ అసిస్టెంట్ వేణు, బందయ్య పాల్గొన్నారు.

..ప్రతిభ చాటిన బాలికల జట్టు

(మొదటి పేజీ తరువాయి)

స్వీకరించాలన్నారు. క్రీడల ద్వారానే కీర్తి ప్రతిష్టలు పొందుతారన్నారు. రాజ కీయ రంగులేనివి ఆటలు పోటీలేనని పేర్కొన్నారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ శారద మాట్లాడుతూ అండర్ 19 బాలికల హ్యాండ్ బాల్ పోటీలలో ప్రతిభ చూపిన క్రీడాకారులను జాతీయ జట్టుకు పూర్తి పారదర్శకతతో ఎంపిక చేయడం జరిగిందన్నారు. టోర్నమెంట్ లో ఎంపికైన బాలికలు డిసెంబర్ 11 నుండి 17 వరకు పంజాబ్ రాష్ట్రంలోని లూధియానా లో జరిగే జాతీయ స్థాయిలో జరిగే పోటీలలో పాల్గొంటారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ హైస్కూల్ హెచ్ఎం చంగల్ రెడ్డి, జూనియర్ కళాశాల ఇంఛార్జి ప్రిన్సిపాల్ కీర్తిపాటి ప్రసాద్ వర్మ,అథిలెటిక్ అసోసియేషన్ సెక్రటరీ విజయ ప్రసాద్ రెడ్డి, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం చంద్రమోహన్ రాజు, అబ్జర్వర్ విజయ్ కుమార్ (ప్రకాశం జిల్లా), ఆంధ్రప్రదేశ్ జిల్లాల్లోని బాలికల హ్యాండ్ బాల్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయా నిర్మాణానికి విరాళం

విశాలాంధ్ర-నందలూరు : మండలంలోని నాగిరెడ్డి పల్లె గ్రామంలోని శ్రీ అయ్యప్ప స్వామి వారి దేవాలయం నిర్మాణానికి అరవపల్లికి చెందిన విశ్రాంత ఎల్ఐసి ఏవో మాడపూరి సుబ్బారాయుడు, ఆయన ధర్మ పత్ని మాడాపూరి హేమలత వారి కుటుంబ సభ్యులు ఒక పిల్లర్ నిర్మాణానికి గాను 52,116/- రూపాయలు విరాళంగా ఆలయ ప్రతినిధి ఏనుగుల బాలాంజనే యులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా బాలాంజనేయులు మాట్లాడుతూ దాత మాడాపూరి సుబ్బారాయుడు వారి కుటుంబ సభ్యులకు శ్రీ అయ్యప్ప స్వామి వారు అష్టై శ్వర్యాలు, ఆయురారోగ్యాలతో ప్రసాదం చాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

నాయిని గిరిధర్ కు అరుదైన గౌరవం..ఆర్ట్ ఆఫ్ ఏపీ పుస్తకంలో చోటు

విశాలాంధ్ర-రాజంపేట: రాజంపేటకు చెందిన ప్రముఖ చిత్ర కళాకారుడు నాయిని గిరిధర్ కు అరుదైన గుర్తింపు లభించింది. ప్రముఖ రచయిత కళాసాగర్ యల్లపు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అత్యద్భుత ప్రతిభావంతులైన వివిధ రంగాలలోని కళాకారులను గుర్తించి "ఆర్ట్ ఆఫ్ ఏపీ" అనే పుస్తకాన్ని రచించి ఆదివారం విజయవాడ లోని భవానిపురం, హరిత బెర్మ్ పార్క్ కాన్ఫరెన్స్ హాల్ నందు అతిరథ, మహారథుల సమక్షంలో పుస్తకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమానికి సినిమాటోగ్రఫీ మరియు సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్, మాజీ ఉప సభాపతి మండలి బుద్ధ ప్రసాద్, పద్మశ్రీ అవార్డు గ్రహీత సివి రాజు, గిరిజన గీత శిల్పి, ఆర్ట్ ఆఫ్ ఏపీ ఎడిటోరియల్ బోర్డు సభ్యులు బొండా జగన్మోహన్రావు, విశాఖ ఏ.యు డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్స్ ఆర్ట్స్ విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ వి.రమేష్, కవి గంటేడ గౌరు నారాయణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొని కళాకారులను అభినందించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక కాబడిన 300 మంది కళాకారులలో అన్నమయ్య జిల్లా నుంచి నాయిని గిరిధర్ ఉండటం రాజంపేట ప్రాంతానికే గర్వకారణమని, ఆయన భవిష్యత్తులో మరిన్ని అరుదైన రికార్డులు నెలకొల్పి ఈ దేశానికి, ఈ ప్రాంతానికి వన్నెతెవాలని రాజంపేట వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

పెండింగులో ఉన్న క్లైములను పరిష్కరించాలి

ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం డిమాండ్

విశాలాంధ్ర-మదనపల్లె : రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం నిర్మాణ రంగం కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చెప్పిన హామీ మేరకు కోటి రూపాయలు ఆయన సొంత నిధులు జమ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు గాలి చంద్ర, సలీం బాషాలు డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం ఏఐటీయూసీ రాష్ట్ర సమితి పిలుపు మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూన్ 12వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబు నాయుడు నేటికీ ప్రభుత్వం ఏర్పడి 5 నెలలు గడుస్తున్నా నేటికీ భవణ నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీపై మాట్లాడలేదని,ఇంతవరకు అనేకసార్లు జరిగిన మంత్రివర్గ సమావేశాలలో నిర్మాణ రంగం కార్మికులపై ఏమాత్రం చర్చ కూడా జరపలేదని ఆరోపించారు. సోమవారం నుంచి జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలలో నిర్మాణ కార్మికులపై చర్చించి సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పెండింగులో ఉన్న 42వేల క్లైములకు నిధులు మంజూరు చేయాలని, బోర్డు నుండి గతంలో దారి మళ్లించిన నిధులను బోర్డుకి జమ చేయాలని కోరారు. అలాగే కూటమి ప్రభుత్వం అధికారంలో వస్తే సంక్షేమ బోర్డు ఫైల్ పై మొదటి సంతకం పెడతామని హామీ నిలబెట్టి కోవాలని లేకుంటే గత వైసిపి ప్రభుత్వం పట్టిన గతే మీకు పట్టుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి సుదీర్ కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కోశాధికారి హుస్సేన్, వర్కింగ్ ప్రెసిడెంట్ వేణు గోపాల్ రెడ్డి, గఫూర్, బాలకృష్ణ, రమేష్, శంకర, మహమ్మద్ హుస్సేన్, నరసింహా, రమణ, భీమయ్య, నాగేంద్ర, రంగన్న, పవణ్ తదితరులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు కట్టా యానాదయ్య డిమాండ్

విశాలాంధ్ర - ఒంటిమిట్ట :ఒంటిమిట్ట మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు కట్టా యానాదయ్య ఒంటిమిట్ట రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఒంటిమిట్ట తాసిల్దార్ రమణమ్మకు యానాదయ్య రైతులు ఈ మేరకువినతి పత్రం అందించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాలుగా వర్షాలు కురవక వర్షా బావ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. వర్షాలు పడకపోవడంతో అరటి బొప్పాయి నిమ్మ కూరగాయలు తదితర పంటలు ఎండిపోతున్నాయన్నారు. మండల వ్యాప్తంగా 380 బోర్లలో నీరు లేక ఎండిపోయే అన్నారు. మల కాటి పల్లె సాలాబాద్ రాచపల్లిపల్లె సీతాపురం రాచగుంటపల్లె ఇబ్రహీంపేట వెంకటాయపల్లె ఒంటిమిట్ట చెంచు గారి పల్లె నర్వకాటపల్లి మంటపంపల్లె చింతరాజు పల్లె మాధవరం తదితర గ్రామాల్లో బోర్లు ఎండిపోయి సాగునీరు తాగునీరు లేక ప్రజలు అల్లాడిపోతున్నారని వాపోయారు ప్రభుత్వం తక్షణం స్పందించి ఒంటిమిట్ట మండలాన్ని కరువు మండలాలు ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రామసుబ్బయ్య నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం

విశాలాంధ్ర-మదనపల్లె: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మదనపల్లిలో ఉర్దూ ఉపాధ్యాయులు కౌసర్ భేగం ఆధ్వర్యంలో, ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు పుణ్యవతి ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవం, అబుల్ కలాం ఆజాద్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కౌసర్ బేగం మాట్లాడుతూ మొట్టమొదటి భారతదేశం విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన వ్యక్తి అబుల్ కలాం అని వారు నవంబర్ 11 జన్మించారన్నారు. వీరు జాతీయ కాంగ్రెస్‌లో స్వతంత్ర సమర యోధులుగా పనిచేసి విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్,యూనివర్సిటీ గ్రాండ్ కమిషనర్ గా ఐఐటి ఖరగ్ పూర్ లోస్థాపించారన్నారు.అబుల్ కలాం ఆజాద్ ఇండియా విన్స్ ఫ్రీడమ్ గూబర్ ఇ కటీయార్, తజకిర్హ, ఖురాణ అనువాదం మౌలానా చేశారు. భారతరత్న 1992 భారత ప్రభుత్వం ఇచ్చి సత్కరించిందని తెలిపారు. ఈ సమావేశంలో సోషియల్ ఉపాధ్యాయులు అన్వర్ భాష, సోమశేఖర్ నాయకులు గాలి రవీంద్ర , టి సుధాకర్ నాయుడు, ముబారక్ బాషా తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు కుటుంబాలకు అండగా నిలచే పార్టీ టిడిపి

విశాలాంధ్ర - రామాపురం : కార్యకర్తలకు వారి కుటుంబాలకు అండగా నిలిచే పార్టీ మండల తెలుగు యువత అధ్యక్షుడు ఐటిడిపి ఛాంపియన్ నాగభూషణ్ రెడ్డి అన్నారు. రాష్ట్ర రవాణా యువజన క్రీడల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదేశాల మేరకుమండలంలోని హసనాపురం పంచాయతీలో సోమవారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ వంద రూపాయలు చెల్లించి సభ్యత్వం పొందితే 2 సంవత్సరాలు ఐదు లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. టిడిపి సభ్యత్వ కార్డు ఉన్న వ్యక్తి మరణించిన రోజు అంత్యక్రియ ఖర్చులకు పదివేలు అందిస్తున్నారు. కార్యకర్తలకు పార్టీఅండగా నిలవాలనే ఉద్దేశంతో చంద్రబాబు, నారా లోకేష్ ఎన్నో స్కీములు తీసుకొచ్చారు.ఈ కార్యక్రమంలో రాయచోటి నియోజకవర్గ ఐటీడీపీ ఛాంపియన్,ఐ టి డి పి కార్యకర్తలు గణేష్ ధన తదితరులు పాల్గొన్నారు.

రెవిన్యూ సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలి - తహశీల్దార్

విశాలాంధ్ర - రైల్వే కోడూరు : మండలం తహశీల్దార్ కార్యాలయంలోని ప్రజా సమ స్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు ఇస్తున్న ఆర్జీలు పున రావృతం కాకుండా క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించి పరిష్కరించాలని తహశీల్దార్ ఎస్ మహబూబ్ చాంద్ రెవిన్యూ సిబ్బందిని ఆదేశించారు.ఫిర్యాదు దారుల నుంచి ఆర్జీలను స్వీకరించి పరిశీలించి సంబందిత విఆర్ఓ లకు పంపించారు.సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.ఈసందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రతి ఆర్జీ సమగ్ర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.సమస్యలు పరిష్కరించని పక్షంలో ఆర్జీ దారులు అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తారన్నారు.జిల్లా కలెక్టర్ నుండి అందరికీ ఇబ్బందులు ఎదురౌతాయన్నారు.అలా జరగకుండా సమస్యలను ఇక్కడే పరిష్కరించడానికి కృషి చేయాలని కోరారు.రెవిన్యూ సూపరింటెం డెంట్ ఎం శివకుమార్,ఆర్ఐ లక్ష్మిదేవి,రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ మానస, ఎలక్షన్ డిటి గల్లా వెంకటరమణ, సీనియర్ అసిస్టెంట్ మల్లిఖార్జున రెడ్డి,విఆర్ఓలు విఆర్ఏ లు తదితరులు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉమామహేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

రెండవ కార్తీక సోమవారం పోటెత్తిన భక్తులు

విశాలాంధ్ర-గాలివీడు: గండిమడుగు శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసం రెండవ సోమవారం సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. వేకువ జామునే మూల్ విరాట్ మూర్తికి అభిషేకాలు, అర్చనలు,ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి పరమేశ్వరుడుకి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు.వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు కుశావతీ నదీ తీరాన పవిత్ర స్నానాలు ఆచరించి ఆలయ ప్రాంగణంలో మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు.హర హర మహాదేవ అంటూ శివనమస్మరణతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.ఈనెల 15 వ తేదీ కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయ ప్రాణగణంలో భక్తులకు అన్నప్రసాధాల వితరణ కార్యక్రమం ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆలయ చైర్మన్ శ్రీనువాసులు, పుల్లారెడ్డి,కమిటీ సభ్యులు వెంకటేష్,విష్ణువర్ధన్ రెడ్డి,యోగాంజుల్రెడ్డి,ఉమాశంకర్, చంద్రాయుడు, ప్రసాద్,రమణ,తదితరులు పాల్గొన్నారు.

పీలేరు ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర-పీలేరు : పీలేరు ఆర్యవైశ్య సంఘం కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.స్థానిక కన్యకా పరమేశ్వరి దేవాలయంలో నూతన ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా బలస వేణుగోపాల్,కార్యదర్శిగా రేవూరిసుధీర్ కోశాధికారిగా కేసర్ల బాల సుబ్రమణ్యం, జాయింట్ సెక్రటరీగా చింతలపల్లి రాజేష్, ఉపాధ్యక్షులుగా పామిడి మల్లికార్జున గుప్తా, 15 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకొని పూర్వ ప్రెసిడెంట్ కూన సత్యం అధ్యక్షతన ప్రమాణస్వీకారం చేయించారు.ఆర్యవైశ్యులకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా సంఘం ముందుంటుందన్నారు. ఆలయ అభివృద్ధికి తోడ్పాటు చేస్తుందని పీలేరు గ్రామానికి ఆర్యవైశ్యులు సహాయ సహకారాలు అందిస్తామని త్రికరణ శుద్ధితో శ్రీ వాసవి మాత పాదాల సాక్షిగా ప్రమాణం చేశారు.

ఎస్సీ ఎస్టీ సంక్షేమానికి పెద్దపీట

విశాలాంధ్ర- పీలేరు :ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ప్రవేశపెట్టిన మొదటి బడ్జెట్లో ఎస్సీ ఎస్టీ సామాజిక వర్గ సంక్షేమానికి సంబంధించి ఆర్థిక మంత్రి పయ్యావలపు కేశవ్ పెద్దపీట వేయడం హర్షనీయమని అన్నమయ్య జిల్లా విజిలెన్స్ మరియు మానిటరింగ్ కమిటీ సభ్యులు బోధిషా వలి అన్నారు. ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో భాగంగా ఎస్సీ సంక్షేమానికి 18497 కోట్లు మరియు ఎస్టి సంక్షేమానికి 7557 కోట్ల రూపాయలు కేటాయించడం ఎస్సీ ఎస్టీ సామాజిక వర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందనడానికి నిదర్శనమన్నారు. జిల్లాలోని ప్రతి ఎస్సీ ఎస్టీ సామాజిక వర్గానికి సంబంధించిన వాళ్ళకి వ్యక్తిగతంగా మరియు సంఘటితంగా అభివృద్ధి చెందే దిశగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ ఫలాలను అందే విధంగా కృషి చేస్తానని ఈ సందర్భంగా బోధిషా వలి అన్నారు.

ఎయిడ్స్ వ్యాధి ప్రమాదకరంపై అవగాహన -కోర్ స్వచ్చంద సంస్థ రాజమ్మ

విశాలాంధ్ర- పీలేరు :మహమ్మారి ఎయిడ్స్ వ్యాధి ప్రమాదకరం పై అవగాహనా కార్యక్రమం నిర్వహించినట్లు కోర్ స్వచ్చంద సంస్థ రాజమ్మ పేర్కొన్నారు.జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ కోర్ స్వచ్చంద సంస్థ ఆధ్వర్యంలో తలపల జడ్పీ హైస్కూల్ పాఠశాలలో మీకు తెలుసా హెచ్ఐవి ఎయిడ్స్ పైన అవగాహనా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో హెచ్ఐవి/ఎయిడ్స్ ఎలా వస్తుంది ఎలా రాదు హెచ్ఐవి స్థితిని ప్రారంభం లోనే తెలుసుకొని జాగ్రత్తలు తీసుకోకపోతే ఎయిడ్స్ దశకు చేరే అవకాశం ఉంటుందన్నారు.సుఖవ్యాధుల నియంత్రించడంలో కాండోమ్ ముఖ్య పాత్ర వహిస్తోందన్నారు. అప్సక్స్ యాప్, టోల్ ఫ్రీ నెంబర్ 1097 గురించి పిల్లల కు అవగాహనా కల్పించడం జరిగింది ఈ కార్యక్రమంలో కోర్ స్వచ్చంద సంస్థ కే. రాజమ్మ,షర్మిల కే.సల్మా, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

దొరసాని పల్లెలో టీడీపీ సభ్యత్వ నమోదు

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: తెలుగుదేశం పార్టీ సభ్యత్వంతో కార్యకర్తలకు, ప్రజలకు పలు ఉపయోగాలు ఉన్నాయని దొరసాని పల్లె సర్పంచ్ అరవ ఈశ్వరమ్మ తెలిపారు. సోమవారం నాడు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ఆదేశాలతో దొరసాని పల్లెలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. రూ.100తో సభ్యత్వం తీసుకుంటే రూ.5లక్షల ప్రమాద భీమా వరిస్తుందని, అదేవిధంగా కార్యకర్తల కుటుంబాలకు విద్య, వైద్యం, ఉపాధి కోసం సాయం అందిస్తుందని తెలిపారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉండే పార్టీ తెలుగుదేశం పార్టీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అరవ మునివర తదితరులు పాల్గొన్నారు.

14 నుండి 57వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు పట్టణంలోని స్థానిక రామేశ్వరం బాల బాలికల గ్రంధాలయంలో ఈ నెల 14వ తేది నుండి 20వ తేది వరకు 57వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు గ్రంధాలయ రికార్డు అసిస్టెంట్ ఇబ్రహీం సాహెబ్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలల విద్యార్థులకు పద్య పఠనం, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలను నిర్వహించి గెలుపొందిన విజేతలకు 20వ తేదిన బహుమతులు ప్రధానం చేస్తారని ఆయన తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు తమ పేర్లను గ్రంధాలయంలో నమోదు చేసుకోవాలని తెలిపారు.

ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: మున్సిపల్ పరిధిలోని 33వ వార్డులోని ఎస్‌వివి గవర్నమెంట్ బాయ్స్ హైస్కూల్‌లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ 137వ జయంతి కార్యక్రమాన్ని రోజి వెల్ఫేర్ సొసైటీ వారి ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మున్సిపల్ కమీషనర్ మల్లికార్జున, కౌన్సిలర్లు కమాల్ బాషా, గాజుల శివజ్యోతి, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు చింత కుంట కుతుబుద్దీన్, విద్యాకమిటీ చైర్మెన్ అలీ బాష, డెంటల్ డాక్టర్ సుజాత(ఎండీఎస్) పాల్గొన్నారు. ఈ సంధర్భంగా డాక్టర్ సుజాత పిల్లలకు దంతాలను చెక్ చేసి పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి కమీషనర్ మల్లికార్జున మాట్లాడుతూ వారిలో దేశ భక్తి దేశ కీర్తి గురించి తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు జహీరుద్దీన్, హుస్సేన్ సాహెబ్, దేశం రెడ్డి, ఖాదర్ వలీ, డీజే షఫి, షాకీర్, గాజుల రవికుమార్, అంజి పాల్గొన్నారు. ఈ సంధర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు పెట్టి మొదటి బహుమతిగా గడియారము, రెండో బహుమతిగా అట్లాస్ ఇచ్చి సొసైటీ తరపున విద్యార్థులకుభోజనం అందించారు.

పీలేరు బస్సు రాలేదని స్పందనలో ఫిర్యాదు

విశాలాంధ్ర-సుండుపల్లె : పీలేరు డిపో నుండి ఆర్.టి.సి.బస్సులు సమయపాలన పాటించలేదని సోమవారం స్పందనలో గ్రామస్తులు ఫిర్యాదు చేశారు పల్లెలమీదిగా పింఛకు రెండు బస్సులు ఉన్నాయని అవి కూడా సరైన సమయానికి రాక చుట్టుప్రక్కల వున్న రైతులు కూరగాయలు వారం సంతలకు వెళ్లే రైతులు,విద్యార్థులు,ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని గ్రామాల ప్రజలు ఆసుపత్రికి వెళ్ళడానికి బస్సులు లేక చాలా ఇబ్బంది. పడుతున్నారు. ఆదివారం వచ్చిందంటే బస్సులు రావడంలేదని. స్పందనకు ఫిర్యాదు చేశారు.

ఎడిఫై స్కూల్ ప్రారంభం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరులో నూతనంగా ఏర్పాటుచేసిన ఎడిఫై స్కూల్‌ను మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి ప్రారంభించారు. స్థానిక కొర్రపాడు రోడ్డు ఆదిత్య కాంప్లెక్స్ ఆవరణంలో ఎడిఫై స్కూల్‌ను జ్యోతి ప్రజ్వలన గావించి ప్రారంభించారు. ఈ సంధర్భంగా ముఖ్య అతిధిగా పాల్గొన్న మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి మాట్లాడుతూ ఎడిఫై స్కూల్‌ను కామనూరు గ్రామం వద్ద ఏర్పాటు చేయడం వల్ల రాష్ట్ర స్థాయిలో మా కామనూరు గ్రామం పేరు నలుమూలల తెలుస్తుందన్నారు. ఎడిఫై స్కూల్ ఏర్పాటుకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. మరో అతిధి ఏకే అగర్వాల్ మాట్లాడుతూ టీచింగ్ క్వాలిటీ గుడ్ కమ్యూనికేషన్, స్కిల్స్‌ను విధ్యార్థులకు అందించడంలో ఎడిఫై స్కూల్ ముందంజలో ఉందన్నారు. దేశవ్యాప్తంగా ఎడిఫై స్కూల్ ద్వారా విధ్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తామన్నారు. రాయలసీమలో అనంతపురం, మదనపల్లితో పాటు ప్రొద్దుటూరులో ఎడిఫై స్కూల్‌ను ఈ ప్రాంతంలోని విధ్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చాం అన్నారు. ఎత్తపు అమర్‌నాథ్ రెడ్డి మాట్లాడుతూ ప్రొద్దుటూరు మండలం కామనూరు గ్రామంలో ఎడిఫై స్కూల్‌ను 13ఎకరాలలో నూతనంగా నిర్మిస్తున్నామన్నారు. మొత్తం ఏసీ క్యాంపస్, రెసిడెన్షియల్ ఫెసిలిటితో ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. గురుదేవ్ రామ్‌రెడ్డి మాట్లాడుతూ ఎడిఫై స్కూల్‌లో చదివే విధ్యార్థులను మేధావులుగా తీర్చిదిద్దడమే కాకుండా ఉన్నత స్థితికి చేరేలా తయారు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున విధ్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రధాని మోడీ నేతృత్వంలో భారత్ ముందంజ : గోపీ శ్రీనివాస్

విశాలాంధ్ర-మదనపల్లె : కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేయడం కోసమే కులాల మధ్య వర్గీకరణ చిచ్చు పెడుతోందని బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గోపి శ్రీనివాస్ ఆరోపించారు. సోమవారం స్థానిక బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంస్థాగతంగా బిజెపి పార్టీ నిర్మాణం కోసమే పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అనేక అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలతో అన్నివర్గాలను సంతృప్తి పరిచేలా ముందుకు వెళుతోందని పేర్కొన్నారు. దేశంలో కుల వర్గీకరణపై కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ చేస్తున్న వ్యాఖ్యలను ఖండించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ఇచ్చిన గ్యారెంటీలను వెనక్కి తీసుకోవడానికి వర్గీకరణ పేరుతో కొత్త నాటకానికి తెరతీసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఓబీసీ అధ్యక్షులు రేపన శివప్రసాద్, బిజెపి అసెంబ్లీ కార్యదర్శి భగవాన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళి నాయుడు, డి.ఎన్.టి రాష్ట్ర కన్వీనర్ ఆరబోలు చంద్రశేఖర్, ఓబిసి జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్ రాజా యాదవ్, పార్టీ సీనియర్ నాయకులు బండి ఆనంద్, పులి నరేందర్ రెడ్డి, రూరల్ మండల అధ్యక్షులు పచ్చిపాల వసంత కుమార్, మఠం కిరణ్ కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మిట్స్‌లో హాండ్స్ ఆన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్

విశాలాంధ్ర-మదనపల్లె: మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్, మదనపల్లె కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విభాగము వారు కళాశాల మిట్స్ ఐఎస్‌టిఈ (మిట్స్)స్టూడెంట్స్ చాప్టర్ వారి సహకారంతో 3డి బీమ్ మోడలింగ్ యూసింగ్ రెవిట్ అండ్ నావిస్ వర్క్స్ మేనేజ్ అనే అంశం పై ఆరు రోజుల హాండ్స్ ఆన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ను నిర్వహించారు. ఈ కార్యాక్రమానికి ముఖ్య అతిధిగా కేరళకి చెందిన డాక్టర్ పి కిషోర్, హాబిలెట్ లెర్నింగ్ సొల్యూషన్స్ కంపెనీ డైరెక్టర్, రొన్నిఈ జార్జ్ ఫిలిప్, ఆపరేషన్స్ మేనేజర్, ఎరిక్సన్ గ్లోబల్ సర్వీసెస్ పాల్గొన్నారు. కార్యకమంలో పి కిషోర్ మాట్లాడుతూ నిర్మాణ రంగంలో తాజా పద్ధతులు, ప్రమాణాలపై అధ్యాపకులు, విద్యార్థులను ద్రుష్టి సారించాల న్నారు. అందుకు ఈ 3డి మోడలింగ్ సాఫ్ట్వేర్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు.. ప్రాజెక్టులు సకాలంలో, బడ్జెట్‌లో పూర్తయ్యేలా మరియు అవసరమైన అన్ని భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చేయడంలో నిర్మాణంలో నాణ్యత నియంత్రణ కీలక పాత్ర పోషిస్తుంది అని అన్నారు. సివిల్ ఇంజనీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఈ సాఫ్ట్వేర్ ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ దీపాంకర్ రాయ్, ఫాకల్టీ కోఆర్డినేటర్ ఆర్ వినోద్ కుమార్ , మిట్స్ ఐఎస్‌టిఈ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీ దివ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

భూకబ్జాదారులపై చర్యలు తీసుకోండి-డిబిఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు బద్దె భాను ప్రకాష్

విశాలాంధ్ర- పీలేరు : ప్రభుత్వ భూమి ఆక్రమించు కొన్న కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని డిబిఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు బద్దె భాను ప్రకాష్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జె.సికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పీలేరు మండలం బోడుమలు వారిపల్లి పంచాయతీలో గత ప్రభుత్వంలో ఎంతమందికి నిరుపేదలకు పక్క గృహాలు అందజేశారని దళిత బహుజన విద్యార్థి ఫెడరేషన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు బద్దే భాను ప్రకాష్ అన్నారు. ప్రభుత్వ భూమి ఆక్రమించుకొని ఇంటి పట్టాలు కూడా లేకుండా ఇతరులకు లక్షలాది రూపాయలకు అమ్ముకున్న వ్యక్తులపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బోడుమల్లువారి పల్లి పంచాయతీలో పూర్తిస్థాయిలో విచారణ జరిపించి పంచాయతీలో ఏదైతే డీకేటి భూమి ఆక్రమించుకున్న వ్యక్తులపై అధికారులు తక్షణమే విచారించి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. బయట మండలం వారు కూడా మా పంచాయతీలో ప్రభుత్వ భూమి ఆక్రమించుకోవడం జరిగింది వీటిని అన్నిటి మీద పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని తెలిపారు.

మాదిగల ఆత్మీయ సదస్సు ను విజయవంతం చేద్దాం

విశాలాంధ్ర-పీలేరు: మదనపల్లిలో నిర్వహించే మాదిగల ఆత్మీయ సదస్కు మంద కృష్ణ మాదిగ ముఖ్యఅతిథిగా విచ్చేయుచున్నారు. ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎంఆర్పిఎస్ దుడ్డు రామకృష్ణ మాదిగ పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా ప్రచారంలో భాగంగా పీలేరు నియోజకవర్గం పీలేరు మండల కేంద్రంలోఎం ఆర్ పి ఎస్ పీలేరు మండల అధ్యక్షులు చరణ్ కుమార్, మాజీ అధ్యక్షులు బండ్ల వంక పివి రమణ,అలాగే కేవీ పల్లి మండలం ఎం ఎస్ పి ఇన్చార్జ్ దొడ్డి వెంకటాచలపతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా హాజరైన ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దుడ్డు రామకృష్ణ మాదిగ,విశిష్ఠ అతిధులుగా ఎం.ఎస్.పి పీలేరు నియోజకవర్గ ఇన్చార్జి గండికోట వెంకటేష్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ గత 30సంవత్సరాలుగా మాదిగ, మాదిగ ఉపకులాల ఉజ్వల భవిష్యత్ క్రై, మరియు సమాజం లోని పేదవర్గాల సంక్షేమనికై అనేక రకాల మిలిటెంట్ ఉద్యమాలు చేశారన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మందకృష్ణ మాదిగ పర్యటన విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పి పీలేరు నియోజ కవర్గ ఇంచార్జ్ గండికోట వెంకటేష్ మాదిగ, విహెచ్ పి ఎస్ నాయకులు భాస్కర్, బండ్ల వంక రమణ, యువ నాయకులు గండికోట రెడ్డి కుమార్, నరసింహ, అన్నవరం, రాజశేఖర్, మహిళలు, కె.వి పల్లి మండలం ఎం ఆర్ పి ఎస్ జిల్లా నాయకులు ముస్తూరు విశ్వనాథ, సీనియర్ నాయకులు నాగేశ్వరరావు, ముల్లంగి గురవయ్య,మాజీ మండల అధ్యక్షులు ఆదినారాయణ ఎంఈఎఫ్ నాయకులు శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

అమూల్ ఐస్ క్రీం పార్లర్ ప్రారంభం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు పట్టణంలోని గాంధీరోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన అమూల్ ఐస్ క్రీం పార్లర్‌ను ధర్మ పరిచయ కమిటి డైరెక్టర్ సయ్యద్ అహమ్మద్, కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ డైరెక్టర్ ఇస్సాక్ అలీ, కడప మదరసా ఉస్మాన్ ప్రిన్సిపల్ ముస్తి అబ్దుల్ నాగూర్ అల్లాకు దువా చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని ముస్లిం పెద్దలు, ముస్లిం సోదరులతో పాటు నూతన షాపు యజమాని సయ్యద్ షబ్బీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

ఒరిజినల్ దస్తావేజులు పోయినవి

ఉదయగిరి శ్రీనివాసులు, తండ్రి ఉదయ గిరి రమణ, నివాసం : ఇంటి నెం. 1/1644, యర్ర ముకపల్లి, కందిపాళెం, వైఎస్ ఆర్ జిల్లా, నేను దస్తావేజులు జిరాక్స్ కోసం పుట్లంపల్లి ప్రాంతంలోని సబ్-రిజిస్ట్రార్ ఆఫీసు వద్దకు వెలుతుండగా, నా యొక్క సెటిల్‌మెంట్ ఒరిజినల్ దస్తావేజులు పోయినవి. దస్తావేజు నెం: 1453/2020. ఈ దస్తావేజు ఎవ్వరికైనా దొరికిన యెడల క్రింది ఫోన్ నెంబరుకు గానీ, పై అడ్రస్సుకు గానీ తెలుపగలరు. తగిన పారితోషికం ఇవ్వబడును.

ఫోన్ నెంబరు : 9676225254

మైనార్టీలలో విద్యా చైతన్యం రావాలి: ఎమ్మెల్యే

విశాలాంధ్ర–మదనపల్లె: మైనార్టీలలో విద్యా చైతన్యం రావాలని ఎమ్మెల్యే షాజహాన్ బాష అన్నారు. సోమవారం విజయవాడ లోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన మైనార్టీల సంక్షేమ దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మైనార్టీలలో అక్షరాస్యత శాతం తక్కువ ఉందని, వారు చదువు లో రాణించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఉర్దూ పాఠశాలలు, భాషాభివృద్ధి కి కృషి చేసిన వారికి వివిధ విభాగాల్లో అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో మైనార్టీ, న్యాయశాఖ మాత్యులు ఎన్. ఎం. డి. ఫారూఖ్, సత్యప్రసాద్, ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, శ్రీనివాస రావు, మైనార్టీ వ్యవహారాల సలహాదారులు ఎం. ఏ. షరీఫ్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ మౌలానా ముష్తాక్ అహ్మద్, ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఫారూఖ్ షుబ్లీ, వివిధ జిల్లాలకు చెందిన ఉర్దూ ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

అన్నమాచార్య యూనివర్సిటీలో జాతీయ విద్యా దినోత్సవం

విశాలాంధ్ర – రాజంపేట: అన్నమాచార్య యూనివర్సిటీ నందు సోమవారం జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల టచ్ స్టోన్ విభాగం వారు ప్రపంచ శాంతి కొరకు 'విద్య యొక్క ప్రాముఖ్యత' అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో ఎస్ మేఘన బిటెక్ ద్వితీయ సంవత్సరం (సిఎస్ఈ–ఏఐ) ప్రథమ బహుమతి గెలుపొందగా, ఏ మేఘన బిటెక్ తృతీయ సంవత్సరం (సిఎస్ఈ) ద్వితీయ బహుమతి, సి వేదప్రసన్న బిటెక్ మొదటి సంవత్సరం (సిఎస్ఈ) తృతీయ బహుమతులను గెలుచుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎంవి నారాయణ ప్రతిభ కనబరిచిన విద్యార్థుల కు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య నేటితరంలో ప్రపంచ యుద్ధాలను ఆపడానికి మరియు మనిషి పురోగతిని సాధించడానికి విద్య ఎంతో ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎన్ మల్లికార్జున రావు, హెచ్ఎండ్ఎస్ విభాగాధిపతి డాక్టర్ బి బాలనాగేంద్రప్రసాద్, టచ్ స్టోన్ కో–ఆర్డినేటర్ పి విజయ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

యర్రపురెడ్డి నరసింహారెడ్డి గృహప్రవేశం

విశాలాంధ్ర –సుండుపల్లె: మండల కేంద్రానికి సమీపంలోని ఎగువ ఈడిగపల్లెలో యర్రపురెడ్డి ఆనంద రెడ్డి సోదరుడు నరసింహారెడ్డి నూతన గృహప్రవేశం సందర్భంగా సత్యనారాయణవ్రతం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యర్రపురెడ్డి అజయ్ రెడ్డి, మిన్నంరెడ్డి గంగిరెడ్డి, యర్రపు రెడ్డి శివరామిరెడ్డి, దేవపట్ల చక్రవర్తి రెడ్డి, రామ సునీల్ రెడ్డి, లాయర్ శ్రీనివాసులు రెడ్డి, భగవాన్ సహాయరెడ్డి, రెడ్డిచర్ల ధనుంజయ, వెంకటసుబ్బయ్య, జగదీష్ స్వామి, రాచరాయుడు, రామస్వామి రెడ్డి, శివరామ నాయుడు, యర్రపురెడ్డి ఆరంరెడ్డి, రెడ్డయ్య రాజు, యర్రపురెడ్డి మధుసూదన్ రెడ్డి, మేకల ఖాదర్బాషా, కుటుంబ సభ్యులు బంధుమిత్రులు పాల్గొన్నారు,

ఉచిత ఇసుక విధానంలో..

ప్రయివేటు వ్యవస్థను రద్దు చేయాలి : ఏఐటీయూసీ

విశాలాంధ్ర-కడప రూరల్ : ఇసుక మాఫియాను అరికట్టి ఉచిత ఇసుక పాలసీ పకడ్బందీగా అమలు చేసి భవన నిర్మాణ సంక్షేమ మండలి బోర్డును తక్షణమే పునరుద్ధరించాలని ఏపీ భవననిర్మాణ కార్మిక సంఘం ఏఐటియుసి రాష్ట్రవ్యాప్త పిలుపు లో భాగంగా సోమవారం కడప లో మహావీర్ సర్కిల్ నుంచి ర్యాలీగా కలెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకొని నిరసన ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్ నాగసుబ్బారెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కెసి.బాదుల్లా, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు మద్దిలేటి , జిల్లా అధ్యక్ష,కార్యదర్శి బల్లారపు రామాంజనేయులు, కుంచపు లింగన్న లు మాట్లాడుతూ గత జగన్ ప్రభుత్వం హయంలో నిర్మాణ రంగాన్ని సర్వనాశనం చేశారని, ఇసుక సమస్య,సంక్షేమ పథకాల నిలుపుదల, కార్మికుల సొమ్ము తరలింపు వంటి చేయకూడని పనులు చేసి కార్మికుల కుటుంబాలను రోడ్డుపాలు చేశారని విమర్శించారు. అందుకు తగ్గ ఫలితాన్ని నేడు అనుభవిస్తున్నా రని, నూతన ఎన్డీఏ కూటమి చంద్రబాబు ప్రభుత్వం తక్షణమే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను తిరిగి ప్రారంభిస్తూ, 1214 మెమోని తక్షణం రద్దు చేయాలని, పెండింగ్లో ఉన్న క్లయిముల పరిహారాలను తక్షణం కార్మికులకు చెల్లించాలని, గత ఐదేళ్ల కాలంలో ప్రమాద మరణాలలో, ఇతర అనారోగ్య కారణాలతో చనిపోయిన భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. బడ్జెట్లో ఒక్క రూపాయి డబ్బులు కేటాయించకుండానే "సెస్" రూపంలో వచ్చిన డబ్బులతో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాల కోసం ఖర్చు చేయచ్చన్నారు. ఉచిత ఇసుక నిర్ణయం అబాసుపాలు కాకుండా మధ్య దళారీ వ్యవస్థ ప్రైవేట్ ఏజెన్సీలకు కట్టబెట్టడం మానుకోవాలని ,నిర్మాణ రంగ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు సిమెంటు, ఐరన్, కలప, నిర్మాణ సామాగ్రి ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. రాబోయే ఐదేళ్లలో ప్రభుత్వం నిర్మించే నిర్మాణాలన్నీ స్థానిక కార్మికులకే పని కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం ద్వారా కార్మిక వలసలను నిర్మూలించాలని కోరారు. కార్మిక శాఖలో ఖాళీ పోస్టులన్నీ భర్తీ చేయడం ద్వారా భవననిర్మాణ కార్మికులకు మెరుగైన సర్వీసును అందించాలని కోరారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీరాములు, చాంద్ బాషా భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఏసుబు, నాగన్నగౌడ్, ఈశ్వరయ్య, ఎస్ఎం రెడ్డి, మస్తాన్, నాగేశ్వరరావు, బాలాజీ, రమేష్ పీరయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి అబుల్ కలాం కృషి ఎనలేనిది

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : మౌలానా అబ్దుల్ కలాం సేవలు మరువలేనివని తెలుగుదేశం పార్టీ నగర మైనారిటీ అధ్యక్షులు పఠాన్ ఖాజా పీర్ అన్నారు సోమవారం మౌలానా అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలను వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా, విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేసిన గొప్ప వ్యక్తి, అని కొనియాడారు అనంతరం టీడీపీ రాష్ట్ర మైనారిటీ ఉపాధ్యక్షులు షేక్ జీలానీ బాషా, ఆజాద్ చిత్ర పటానికి పూలు వేసి ఘన నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్వర్ణ కారుల సంఘం అధ్యక్షులు పఠాన్ అక్రమ్ ఖాన్, టీడీపీ నాయకులు మరియు ఫ్రెండ్స్ గ్రూప్ ఆఫ్ జిమ్స్ అధినేత ఎస్ కే బాషా తదితరులు పాల్గొన్నారు.

వందల కొద్దీ తప్పులు

– గ్రామసభల ద్వారా పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చర్యలు
– వీలైనంత త్వరగా పరిష్కారం – మండల తాహసీల్దార్ శోభన్‌బాబు

విశాలాంధ్ర-యర్రగుంట్ల : దశాబ్దాల తరబడి అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యల్ని రీసర్వే ద్వారా పరిష్కరిస్తామని గత వైకాపా ప్రభుత్వం చెప్పుకొచ్చింది. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లో హద్దులు గుర్తించే ప్రక్రియ చేపట్టింది. కానీ పరిష్కారం మాట అటుంచితే కొత్త చిక్కులు వచ్చి పడ్డాయి. రీ సర్వే అంతా తప్పుల తడకగా మారింది. వేలాది మంది బాధితులుగా మిగిలారు. వాటిని సరిచేసుకునేందుకు భూ యజమానులు, రైతులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో రీసర్వే చేపట్టిన ప్రాంతాల్లో మళ్లీ గ్రామసభల ద్వారా వాటి పరిష్కారానికి చొరవ తీసుకుంది. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు జరిగిన గ్రామసభల్లో 85కు పైగా ఫిర్యాదులు వచ్చాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. మండలంలో 16 రెవెన్యూ గ్రామాలు ఉండగా ఇందులో గత ప్రభుత్వ హయాంలో 14 గ్రామాల్లో రీ సర్వే పూర్తయింది. ఆయా గ్రామాల్లోని భూ సమస్యలను పరిష్కరించేందుకు వీలుగా ప్రస్తుత ప్రభుత్వం గత నెల (అక్టోబర్) 18వ తేదీ నుండి గ్రామసభలు నిర్వహిస్తోంది. ఇవి డిసెంబర్ 10 వరకు కొనసాగనున్నాయి. వైకాపా ప్రభుత్వం భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం పేరుతో 2020 డిసెంబరులో రీ సర్వే ప్రారంభించింది. ఈ ప్రక్రియ పూర్తి చేసిన భూ ములను భూ యాజమాన్య హక్కు చట్టం పరిధిలోకి తీసుకురావడంతో అప్పట్లో పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. సర్వే పూర్తి చేసిన గ్రామాల్లో అర్హులైన రైతులు వారి భూములపై శాశ్వత హక్కులు కోల్పోయిన పరిస్థితులు తలెత్తాయి. కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు, భూ విస్తీర్ణం, రైతుల పేర్లు ఇతర వివరాల్లో తప్పులు ఉండడంతో రుణాలు పొందలేని దుస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం సర్వేను నిలిపివేసింది. వీటిని గ్రామసభల ద్వారా చక్కదిద్దే దిశగా చర్యలు తీసుకుంటోంది.

త్వరితగతిన పరిష్కారం – తాహసీల్దార్ శోభన్‌బాబు: గ్రామసభల ద్వారా డిసెంబర్ 10 వరకు ఫిర్యాదులు స్వీకరిస్తామని మండల తాహసీల్దార్ శోభన్‌బాబు పేర్కొన్నారు. భూ సమస్యలపై అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయని ఆయన వివరించారు. వీలైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని శోభన్‌బాబు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే వైసీపీ ధ్యేయం

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

విశాలాంధ్ర–పులివెందుల: ప్రజా సమస్యల పరిష్కారమే వైసీపీ ధ్యేయమని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఆయన స్వగృహంలో సోమవారం ప్రజలతో మమేకమయ్యారు. ఆయన నివాసం వద్దకు వచ్చిన ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. వీలైనంత వరకు సమస్యలను పరిష్కరిస్తానని ఆయన ప్రజలకు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ పాలనలో కడప జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేశామన్నారు. అప్పటి సీఎం జగన్ కూడా ఉమ్మడి కడప జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక చొరవ తీసుకున్నారన్నారు. ఇప్పుడు కూడా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి వెన్నుదన్నుగా ఉండటమే తమ ధ్యేయమన్నారు. ఈ సందర్భంగా తాజా పరిస్థితులు తదితర వివరాలను తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు తన వంతు పూర్తి సహాయ సహకారాలను అందిస్తానన్నారు.

శివాలయాల్లో కార్తీక శోభ

విశాలాంధ్ర–సిద్దవటం : కార్తిక మాసం రెండవ సోమవారం సందర్భంగా మండలంలోని నిత్య పూజేశ్వర కోన, కపర్దీశ్వర కోన, సిద్దవటేశ్వర స్వామి, సిద్దేశ్వర స్వామి శివ క్షేత్రాలు భక్తుల శివనామ స్మరణతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. తెల్లవారుజాము నుండే లయకారుడికి ప్రత్యేక పూజలు రుద్రాభిషేకం నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలను సందర్శించి అత్యంత భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలను వెలిగించారు.

రాష్ట్ర వాలీబాల్ జట్టుకు ఎంపికైన గాలివీడు విద్యార్థి

విశాలాంధ్ర–గాలివీడు: రాష్ట్ర వాలీబాల్ జట్టుకు గాలివీడు విద్యార్థి చీకటి జస్వంత్ ఎంపికైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గాలివీడు మండలం కరిమిరెడ్డి గారిపల్లెకు చెందిన విఆర్ఏ కుమార్ కుమారుడు జస్వంత్ కడప చైతన్య కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. గత రెండు రోజులుగా విజయవాడలో జరుగుతున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఇంటర్ ఛాంపియన్ షిప్ వాలీబాల్ క్రీడలో అత్యుత్తమ ప్రదర్శన కనబర చడంతో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. రాష్ట్ర వాలీబాల్ జట్టుకు ఎంపిక కావడం పట్ల తల్లిదండ్రులు, కళాశాల యాజ మాన్యం హర్షం వ్యక్తం చేస్తున్నారు.